# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 15-8-2025 ₹15/-


# సత్యం వద !?



## స్వాతంత్ర్యోద్యమంలో సమర సింహాలు





గీటురాయి
వారపత్రిక
**GEETURAI WEEKLY**
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 32 హైదరాబాద్
శుక్రవారం 15 ఆగస్టు 2025 రూ.15-00
20 సఫర్ 1447 హిజ్రీ

**తొలిగీటు**

అబద్ధం పలకడం ఏ పరిస్థితిలోనూ ధర్మం కాదు. గంభీరంగా గానీ, పరిహాసంగా గానీ అబద్ధం చెప్పకూడదు. మీ పిల్లలకు ఏదయినా ఇస్తామని చెప్పి తరువాత ఇవ్వకపోతే అది కూడా ధర్మం కాదు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com




**మీ ఆలోచనలే మిమ్మల్ని నిర్దేశిస్తాయి**

# లోపల...


| | | |
|---|---|---|
| సత్వాల్ మాలిక్ | ...... | 04 |
| సత్యం వద!? | ...... | 05 |
| మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్ (రజి) – 1 | ...... | 08 |
| చరితార్థులు–2 : డాక్టర్ ముహమ్మద్ ఇక్బాల్ షైదాయి | ...... | 11 |
| స్వాతంత్ర్యోద్యమంలో సమర సింహాలు | ...... | 14 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| బాపూజీతో భుజం భుజం కలిపి.... | ...... | 20 |
| వయసు, సొగసు, మనసు అదుపులో ఉంటేనే శ్రేయస్సు | ...... | 22 |
| మైనార్టీ వ్యధ | ...... | 26 |
| ఆత్మ విమర్శన | ...... | 28 |
| ఇవి యథార్థమైన విషయాలు | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| నడిచే దారిలో | ...... | 34 |


**బెడిసిన స్నేహం...**



ట్రంపు మామ కోసమై
భాజపా శ్రేణి హోమం
ఫలితంగా భారత్‌కు
పెట్టాడు పంగనామం!

ఒకే భావ జాలికులట
ఎందుకొచ్చిందో తేడా
మాట్లాడితె కొట్టుండు
ముఖాన యింత పేడ!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## సత్పాల్ మాలిక్

జమ్ము కశ్మీర్ మాజీ గవర్నర్ సత్పాల్ మాలిక్ తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 79 సంవత్సరాలు. కిడ్నీ వ్యాధితో గత కొంత కాలంగా ఆయన చికిత్స పొందుతూ చివరికి కన్నుమూశారు.

సత్పాల్ మాలిక్ గురించి ప్రస్తావించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. భారత రాజకీయాల్లో విలువలు అడుగంటి పోతున్న కాలంలో నిజాయితీగా నిలబడిన మనిషిగా ఆయన తనదైన చరిత్ర రాసుకున్నారు. ఆయన తీసుకున్న నిర్ణయాలు, ఆయన పార్టీ సిద్ధాంతాలతో ఎన్ని విభేదాలున్నప్పటికీ ఆయన వ్యక్తిత్వాన్ని ప్రశంసించకుండా ఉండలేం.

ఆయన రాసిన చివరి ట్విటర్ పోస్టులో తనకు 150 కోట్ల రూపాయల లంచం ఎర చూపించిన విషయాన్ని బయటపెట్టారు. ప్రభుత్వ ఒత్తిడి ఎంత ఉన్నా తాను పట్టించుకోలేదని అన్నారు. ఇదే ఆయన చివరి సోషల్ మీడియా పోస్టు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తాను బతుకుతానో లేదో తెలియదు కాని దేశానికి నిజాలు తెలియవలసిన అవసరం ఉందన్నారు. సిబిఐ ఆయనపై అవినీతి కేసు పెట్టింది. ఈ కేసుకు సంబంధించి మాట్లాడుతూ 2200 కిరు హైడ్రో పవర్ ప్రాజెక్టును తాను క్యాన్సిల్ చేశానని గుర్తు చేశారు. తన తర్వాత తన స్థానంలో వచ్చిన వారి సంతకంతో ఆ కాంట్రాక్టు ముందుకు వెళ్ళిందని చెప్పారు.

రైతు ఉద్యమాన్ని సమర్థించడం, మహిళా పహిల్వానుల నిరసనలకు సమర్థన ఇవ్వడం వల్లనే తనపై ప్రభుత్వం కక్ష సాధింపునకు పూనుకుని ఈ కేసు పెట్టిందని నిర్మొహమాటంగా రాశారు.

జమ్ముకశ్మీర్ అధికరణ 370 రద్దు తర్వాత ఆయన్ను ప్రభుత్వం గోవా గవర్నర్‌గా పంపించింది. బీజేపీలో ఉంటూ, రాజ్యాంగ పదవులు నిర్వహిస్తూ మోడీ ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన నేత సత్పాల్ మాలిక్. 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడికి సంబంధించి ఆయన అనేక విషయాలు బయట పెట్టారు. ప్రధాని మోడీ స్వయంగా తనను ఈ విషయం మాట్లాడ వద్దన్నారని కూడా చెప్పారు. కేంద్ర హోంశాఖ నిర్ణయాల వల్లనే భద్రతా దళాలు రోడ్డు మార్గాన ప్రయాణం చేయవలసి వచ్చిందని తెలియజేశారు. పుల్వామా ఉగ్రదాడి గురించి మాత్రమే కాదు పహల్గాం ఉగ్రదాడి విషయంలోను మోడీ వైఖరిని ఆయన నిరసించారు. కాని, జమ్ము కశ్మీర్ అధికరణ 370 రద్దు విషయంలో మాత్రం ఆయన ప్రభుత్వం కోరిన విధంగా రద్దుకు అనుకూలంగా సంతకం చేశానని చెప్పారు.

చౌదరీ చరణ్ సింగ్ వల్ల రాజకీయాల్లోకి వచ్చిన సత్పాల్ మాలిక్ భారతీయ క్రాంతిదళ్ పార్టీ తరఫున ఉత్తరప్రదేశ్ భాగ్పట్ నుంచి 1974లో మొదటిసారి ఎన్నికల్లో గెలిచారు. 1980లో కాంగ్రెసులో చేరారు, కాని తర్వాత బోఫోర్స్ ఆరోపణలు వెల్లువెత్తి నప్పుడు జనతాదళ్‌కి మారారు. వి.పి.సింగ్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. 1989లో అలీగఢ్ నుంచి లోక్‌సభకు పోటీ చేయడమే ఎన్నికల్లో ఆయన చివరి గెలుపు. ఆ తర్వాత కొంతకాలం సమాజ్ వాది పార్టీలో ఉన్నారు. 2004లో బీజేపీలో చేరారు.

ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ బీజేపీ ఆయనకు ఉన్నత పదవులు కట్టబెట్టింది. ఆయన కూడా బీజేపీ కోసం నిలబడేవారు. 2012లో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడయ్యారు. 2017లో బిహారు గవర్నర్‌గాను, ఆ తర్వాతి సంవత్సరం జమ్ము కశ్మీర్ గవర్నర్‌గాను నియమించబడ్డారు.

ప్రారంభంలో మోడీని బలంగా సమర్థించిన సత్పాల్ మాలిక్ తర్వాత మోడీ విధానాలను విమర్శించడం ప్రారంభించారు.

తన చివరి పోస్టులో ఆయన చెప్పిన మాటలు గమనార్హమైనవి. 50 సంవత్సరాల రాజకీయ జీవితం తర్వాత, అనేక రాజ్యాంగ పదవులు నిర్వహించిన తర్వాత కూడా తాను ఒకే గది ఉన్న ఇంట్లో నివసించడం గురించి, తనకు ఉన్న అప్పుల గురించి చెప్పారు. తన వద్ద సంపద ఉన్నట్లయితే ప్రభుత్వ ఆసుపత్రికి బదులు ప్రయివేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకునేవాడిని కదా అన్నారు.

సత్పాల్ మాలిక్‌తో చాలా మంది చాలా కారణాల వల్ల విభేదించ వచ్చు. జమ్ముకశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చింది ఆయన గవర్నర్‌గా ఉన్నప్పుడే అన్నది గుర్తు చేసి ఆయన వైఖరిని విమర్శించవచ్చు. జమ్ము కశ్మీర్ గవర్నర్‌గా ఉన్నప్పుడు 370 అధికరణను రద్దు చేయమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాసి పంపినది కూడా తానేనని ఆయన నిస్సంకోచంగా చెప్పుకున్నారు. ఇది కూడా ఆయన్ని గడసరి వ్యక్తిగానే నిలబెట్టింది. ఒక విషయం మాత్రం వాస్తవం–చౌదరీ చరణ్‌సింగ్ తరహాలోనే తనదైన వైఖరిని చాటుకున్న మనిషి. ✤

అబ్దుల్ వాహెద్




**సచ్చా భారతీయ్ అంటే ఎవరు?** ఇది ఎవరు నిర్ణయిస్తారు? ఇప్పుడు ప్రతి ఒక్కరు సచ్చా... అంటే నిక్కమైన, నిజమైన, నికార్సయిన భారతీయత గురించి ఆలోచించుకోవలసిన పరిస్థితులు వచ్చాయి. గౌరవనీయులైన జడ్జిగారు నిజమైన భారతీయుడు ఎలా ఉండాలో చెప్పారు. అంటే ఏదైనా మాట్లాడే ముందు భారతీయతపై ప్రశ్నలు వస్తాయని ఆలోచించుకుని మాట్లాడాలి. అది సత్యమైనా సరే... 'సత్యం వద' అనే మాట ఇప్పుడు షరతులతో వర్తిస్తుంది.

చైనా భారత భూభాగాన్ని ఆక్రమించుకుందంటూ గతంలో రాహుల్ గాంధీ కొన్ని విషయాలు చెప్పారు. దానికి ఆయనపై కేసు నమోదైంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కేసులో విచారణ రాహుల్ గాంధీకి అనుకూలంగానే నడుస్తోంది. ఇప్పటి వరకు యూపీ ప్రభుత్వానికి, ఫిర్యాదుదారునికి నోటీసులు జారీ అయ్యాయి. కేసుపై స్టే విధించారు. కానీ జడ్జిగారు తమ వ్యాఖ్యలో, నిజమైన భారతీయుడెవ్వరూ ఇలాంటి విషయాలు మాట్లాడడు. ఏమైనా చెప్పాలనుకుంటే, పార్లమెంట్ లో చెప్పండి. ప్రజల మధ్య ఎందుకు చెబుతారు? ట్విట్టర్‌లో ఎందుకు రాస్తారు? సోషల్ మీడియాలో ఎందుకు రాస్తారు? అని ఉపదేశించారు. ఈ విషయం ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇక్కడ ప్రశ్న ఏమిటంటే, ఇప్పుడు రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో ఏం రాయాలో జడ్జిగారు నిర్ణయిస్తారా? లేక రాహుల్ గాంధీ తానేం రాయాలో నరేంద్ర మోడీని అడిగి అనుమతి తీసుకుని రాసుకోవాలా? రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుడు, ఆయన పార్లమెంట్‌లో మాట్లాడగలరు. కానీ సగటు పౌరుడికి పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశమే లేదు. సోషల్ మీడియాలో ప్రశ్నించకపోతే ఎక్కడ ప్రశ్నించాలి? అంటే ప్రశ్నించే అవకాశమే లేదు... మౌనంగా ఉండాలి. లేకపోతే నిక్కమైన భారతీయులు కాకుండా పోతారు. నకిలీ భారతీయులుగా మిగిలిపోతారు.

రాహుల్ గాంధీ సమర్థుడైన నాయకుడా కాదా అన్నది కాదు

ఇక్కడ చర్చనీయాంశం. గాంధీ కుటుంబం దేశంకోసం త్యాగాలు చేసిందన్నది వాస్తవం. మోతీలాల్ నెహ్రూ జైలుకు వెళ్లారు. జవహర్‌లాల్ నెహ్రూ జైలుకు వెళ్లారు. ఇందిరా గాంధీ హత్యకు గురయ్యారు. రాజీవ్ గాంధీ హత్యకు గురయ్యారు. అలాంటి కుటుంబానికి చెందిన రాహుల్ గాంధీకి ఇప్పుడు నిజమైన భారతీయుడినని నిరూపించుకోవలసిన అవసరం వచ్చింది.

చైనా సరిహద్దుల్లో 2020లో గల్వాన్‌లో ఘర్షణ జరిగింది. 20 మంది భారత సైనికులు అమరులయ్యారు. ఆ తర్వాత చైనా భారతదేశంలోకి చొచ్చుకు వచ్చిందని చాలా మంది చెప్పారు. మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవనే ఈ విషయమై మాట్లాడుతూ 'లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్'కు ఈ వైపు చైనా సైన్యం మౌలిక సదుపాయాలను నిర్మిస్తోందని చెప్పారు. ఈ విషయం అక్టోబర్ 9, 2021న దైనిక్ జాగరణ్‌లో ప్రచురితమైంది. తపిర్ గావ్ ఒక మాజీ సైనికాధికారి, అరుణాచల్‌ప్రదేశ్ నుండి బీజేపీ ఎంపీ. ఆయన చైనా 50-60 కి.మీ భారత భూభాగాన్ని ఆక్రమించుకుందని చెప్పారు. ఈ వార్త నవంబర్ 19, 2019న ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రచురిత మైంది. ఏప్రిల్ 6, 2024 ట్రిబ్యూన్ వార్త ప్రకారం, చైనా అరుణాచల్‌లోని భారత భూభాగంలో 175 కొత్త గ్రామాలను నిర్మించింది. స్క్రోల్ జనవరి 18, 2024న ప్రచురించిన ఒక వార్త ప్రకారం చైనా అరుణాచల్ ప్రదేశ్‌లో ఒక గ్రామాన్ని నిర్మించిందని, దీనిపై తాము నిశితంగా పరిశీలిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. కేంద్ర ప్రభుత్వం చైనా గ్రామాన్ని నిర్మించలేదని చెప్పలేదు. దాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పింది. నవంబర్ 18, 2021న టైమ్స్ ఆఫ్ ఇండియా, ఎన్‌డిటివిలో ఉపగ్రహ చిత్రాల ఆధారంగా ఒక వార్త వచ్చింది. అరుణాచల్ సరిహద్దులో చైనా రెండవ గ్రామం గురించిన వార్త అది.

రాహుల్ గాంధీ లడఖ్ వెళ్లారు, అక్కడి ప్రజలతో ఆయన సంభాషణ వీడియో అందరికీ అందుబాటులో ఉంది. ఆ సంభాషణలో లడఖ్ ప్రజలు చైనా భారత భూభాగంలోకి చొచ్చుకు వస్తోందని, పాంగోంగ్ సరస్సులోని ఒక భాగాన్ని కూడా ఆక్రమించుకుందని చెబుతున్నారు.

కాని జడ్జిగారి ప్రకారం వీరందరూ నకిలీ భారతీయులా? గౌరవనీయులైన జడ్జిగారికి ఎవరు నిజమైన భారతీయుడో, ఎవరు నకిలీ భారతీయుడో చెప్పే అధికారం రాజ్యాంగంలోని ఏ అధికరణ వల్ల లభించింది?

**బీజేపీ నేతలు ఇప్పుడు మొదటి వ్యాఖ్యను పట్టుకుని రాహుల్ గాంధీ నిజమైన భారతీయుడు కాదని స్వయంగా కోర్టే చెప్పింది చూడండంటూ ప్రచారం మొదలెట్టారు. ఈ ప్రచారం చేసుకోడానికి అవసరమైనన్ని అవకాశాలు జడ్జిగారి వ్యాఖ్యల వల్ల లభించాయి. రెండవ వ్యాఖ్య విషయానికి వస్తే రాహుల్ గాంధీ ఈ మాటలు పార్లమెంటులో కూడా చెప్పారు.**

కర్నాటక నుంచి వచ్చిన వార్త ప్రకారం అక్కడి శ్రీరామ్ సేన, ఒక పాఠశాలలోని నీటి ట్యాంకులో విషం కలిపింది. ఆ నీరు పిల్లలు తాగేవారు. పిల్లలు ఆ నీరు తాగితే వందలాది మంది పిల్లలు చనిపోయేవారు. ముస్లిం ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయించడం కోసమే ఇలా చేశారు. అంటే ముస్లిం ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయించడానికి వందలాది మంది పిల్లల ప్రాణాలను, ఉపాధ్యాయుల ప్రాణాలను ప్రమాదంలో పడేసింది ఈ శ్రీరామ్ సేన. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఈ వార్త ప్రచురించింది. ఇలాంటి వాళ్ళు నిజమైన దేశభక్తులా? నిజమైన భారతీయులా?

గోరఖ్‌పూర్ నుంచి ఒక వార్త వచ్చింది. ఒక వీడియో వైరల్ అవుతోంది. పదిమంది స్నేహితులు భోజనానికి వెళ్ళారు. వారిలో కొందరు నాన్-వెజిటేరియన్లు, కొందరు వెజిటేరియన్లు. వేర్వేరు టేబుల్స్‌పై కూర్చున్నారు. నాన్ వెజిటేరియన్లు చికెన్ బిర్యానీ ఆర్డర్ చేసారు. మరొక టేబుల్‌పై వెజిటేరియన్లు సాదా భోజనం ఆర్డర్ చేసారు. తర్వాత సిసి టివిలో చూస్తే చికెన్ బిర్యానీ తింటున్న ఒక వ్యక్తి ఒక ఎముకను తన స్నేహితుడికి ఇచ్చి, ఆ ఎముకను వెజిటేరియన్ భోజనంలో పెట్టించాడు. తర్వాత ఆ హెూటల్ వెజిటేరియన్ భోజనంలో నాన్-వెజ్ కలుపుతోందని గొడవ చేశారు. హెూటల్‌లో చాలా గొడవ జరిగింది. తర్వాత సిసిటివి ఫుటేజ్ బయటకు వచ్చినప్పుడు తెలిసింది- బిల్లు చెల్లించకుండా ఎగ్గొట్టడానికి ఈ నాటక మాడారని.

ఇదీ దేశంలో పరిస్థితి. దేశంలో నిరంతరం హిందూ-ముస్లిం

నడుస్తోంది. ఈ నేపథ్యంలో జడ్జిగారి వ్యాఖ్యలను పరిశీలించ వలసిన అవసరం ఉంది. మన ప్రజాస్వామ్యంలో మన ప్రతిపక్ష నాయకుడు చైనా మన భూమిని ఆక్రమిస్తోందని ప్రభుత్వాన్ని ప్రశ్నించలేడా?

ప్రతిపక్ష నేతలు కోర్టు వ్యాఖ్యలపై తమ ప్రతిస్పందనను తక్షణమే వ్యక్తం చేశారు.

"జాతీయ ప్రాముఖ్యత ఉన్న విషయాలపై వ్యాఖ్యానించడం రాజకీయ పార్టీల బాధ్యత, ముఖ్యంగా ప్రతిపక్ష నేత బాధ్యత. ప్రభుత్వం మన సరిహద్దులను రక్షించడంలో విఫలమైతే, దానిని ప్రశ్నించడం ప్రతి భారత పౌరుని నైతిక బాధ్యత" అని పేర్కొన్నారు.

కాని మరోవైపు బీజేపీ నేతలకు జడ్జిగారి వ్యాఖ్యతో గొప్ప ఉత్సాహం వచ్చేసింది. రాహుల్ గాంధీకి దేశభక్తి లేనే లేదంటూ ఊదర గొట్టడం ప్రారంభించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సుప్రీం కోర్టుకు తన "కృతజ్ఞత" తెలియజేశారు.

కాని జడ్జిగారు చెప్పిన మాటలు కోర్టు తీర్పులో భాగాలు కావు. ఇవి ఆయన వ్యాఖ్యలు మాత్రమే. ఇలాంటి వ్యాఖ్యలు న్యాయ మూర్తులు పలు సందర్భాల్లో చేస్తున్నారు. గాజాలో ఇస్రాయీల్ జరుపుతున్న అమానుషాలకు వ్యతిరేకంగా ముంబయిలో సిపిఎం నిరసన ప్రదర్శనకోసం అనుమతి కోరింది. పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ కేసులో బాంబే హైకోర్టు "మీ దృష్టి గాజా, పలస్తీనా పైనే ఉంది కానీ దేశంలో ఏం జరుగుతుందో పట్టించు కోవడం లేదు. మన దేశాన్ని చూసుకోండి. దేశభక్తులు అవ్వండి. మన దేశ పౌరుల కోసం ముందుగా దేశభక్తిని చూపించండి" అని హైకోర్టు వ్యాఖ్యానించింది.

ఈ వ్యాఖ్యలపై సిపిఎం పొలిట్ బ్యూరో తీవ్రంగా స్పందించింది. ఈ వ్యాఖ్యలు చేసిన వారికి రాజ్యాంగంలోని రాజకీయ పార్టీల హక్కులకు సంబంధించిన నిబంధనలు తెలియవని, అలాగే మన దేశ చరిత్ర, పలస్తీనా ప్రజలతో సంఘీభావ చరిత్ర కూడా తెలియదని... ఈ వ్యాఖ్యలు మహాత్మాగాంధీ 1940లలో తీసుకున్న వైఖరికి విరుద్ధమైనవనీ ప్రకటించింది.

దీని తరువాత ఒక ప్రముఖ న్యాయవాది సిపిఎం ప్రకటనను కోర్టు ధిక్కారంగా కేసు పెట్టాలంటూ కోరాడు, కాని న్యాయ మూర్తులు సంయమనంతో స్పందిస్తూ, అదనపు వివాదాలు తలెత్తకుండా చూశారు. కొన్ని సందర్భాల్లో, పిటిషనర్లకు రక్షణ ఇస్తూ కోర్టులు చేసే వ్యాఖ్యలు నైతిక బోధలు, సద్బుద్ధి పాఠాల్లా కనిపిస్తున్నాయి. నైతిక బోధలు, హితబోధలు చేయడం న్యాయ స్థానాల పని కాదు. న్యాయస్థానాలు హక్కులను కాపాడ్డానికి ఉన్నాయి.

ప్రస్తుత కేసు విషయానికి వస్తే, చైనా భారత భూభాగం ఆక్రమించుకుందని నిజమైన భారతీయుడెవరూ చెప్పడనే వ్యాఖ్య ఒకటైతే, ఈ విషయాన్ని సోషల్ మీడియాలో కాదు పార్లమెంటులో లేవనెత్తవలసిందనేది రెండవ వ్యాఖ్య.

బీజేపీ నేతలు ఇప్పుడు మొదటి వ్యాఖ్యను పట్టుకుని రాహుల్ గాంధీ నిజమైన భారతీయుడు కాదని స్వయంగా కోర్టే చెప్పింది చూడండంటూ ప్రచారం మొదలెట్టారు. ఈ ప్రచారం చేసుకోడా నికి అవసరమైనన్ని అవకాశాలు జడ్జిగారి వ్యాఖ్యల వల్ల లభిం చాయి. రెండవ వ్యాఖ్య విషయానికి వస్తే రాహుల్ గాంధీ ఈ మాటలు పార్లమెంటులో కూడా చెప్పారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించినంత మాత్రాన ఒక వ్యక్తి నిజమైన భారతీయుడు కాకుండా పోతాడా? రాహుల్ గాంధీ ఈ విష యాన్ని పార్లమెంటులో చెప్పవలసిందని సూచించడంలోను సమస్యలున్నాయి. పార్లమెంటులో మాట్లాడడానికి అవకాశం లభించడం అనేది ముఖ్యమైన సమస్యగా మారుతుంది. ఎవరు నిజమైన భారతీయుడో జడ్జిలు నిర్ణయించలేరని ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా తీవ్రమైన వ్యాఖ్యలుగా ముందుకు వచ్చాయి. ఇండియా కూటమి నేతలంతా జడ్జిగారి వ్యాఖ్యలను విమర్శిస్తున్నారు. ఈ రోజు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన రాహుల్ గాంధీ భారతీయతను ప్రశ్నించిన వారు రేపు ఏ ప్రతిపక్ష నేతనైనా ఈ కారణంతో ప్రశ్నించి బోనులో నిలబెట్టవచ్చు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కోర్టు కేసుల్లో ఇరుక్కోవడం ఇప్పుడు సాధారణంగా కనిపిస్తూనే ఉందని కొందరి అభిప్రాయం. ఉదాహరణకు ప్రొఫెసర్ మహ్మూదాబాద్ కేసులో ఇలాగే జరిగింది. నిజానికి రాహుల్ గాంధీ కేసులో కోర్టు ఉత్తర్వులు రాహుల్ గాంధీకి అనుకూలంగానే వచ్చాయి. కాని అసలు కోర్టు ఉత్తర్వుల కన్నా ఈ మౌఖిక వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఏది ఏమైనా ఇప్పుడు దేశ రాజకీయాల్లో అధిక ధరలు, నిరుద్యోగం, ఆర్థిక వ్యవస్థ, మౌలిక వసతులు, విద్యా వైద్య సదుపాయాల వంటి విషయాలు చర్చల్లోకి రావడం లేదు. దేశభక్తి, భారతీయత మాత్రమే చర్చల్లో కొనసాగుతున్నాయి. ✤

# తల్లిని ఒప్పించిన తనయుడు

ఎస్.ఎమ్. మలిక్

## మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్ (రజి)

### స్థిర చిత్తం

ప్రవక్త మహనీయుల(స) కన్నా వయస్సు తక్కువయినా వరుసకు మామ, ఇస్లామ్ స్వీకరించిన వారిలో మూడవ వారు, నవ యువకులు, తన తల్లిని అమితంగా ప్రేమించేవారు మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్. ఆయనకు తన యీడు లోని యువకుల ఆట పాటల్లో ఆసక్తి లేదు. తన కృషి అంత టినీ విల్లంబుల తయారీలో వెచ్చించేవారు. ఆయన తల్లి, హమ్నా తన కుమారుడు ఇస్లామ్ త్యజించనంతవరకు నిద్రాహారాలు మానివేస్తానని శపథం చేసుకున్నారు. అయినా మహనీయ సఅద్ సన్మార్గాన్ని ఏ మాత్రం వదలని నిష్ఠా పరులు! మూడు రోజుల వరకు పరిస్థితిలో మార్పు రాక పోయేసరికి మహనీయ సఅద్, తల్లి వద్దకు వచ్చి చూశారు. ఆవిడ ఆరోగ్యం బాగా క్షీణించింది.

ఆయన తన తల్లితో, "అమ్మా! నీ కొడుకు అదృష్టం పండి సన్మార్గాన పడ్డాడు. ఈ మార్గం శాంతి మార్గం, దైవ ప్రసన్నతకు గొనిపోయే మార్గం. మీరు కూడా ఈ రుజుమార్గాన్నే అనుసరిం చండి, అల్లాహ్ ప్రసాదించిన ఆహారం భుజించండి, నీళ్ళు త్రాగండి, దైవానికి కృతజ్ఞతలు అర్పించండి" అన్నారు.

ఆమె, "అయితే నీవు నా మాట విని అమ్మ హక్కు నెర వేర్చవు?"

ఆయన, "అమ్మా! ఇటువంటి వేయి తల్లులు ఇస్లామ్ వదల మని పట్టు పట్టినా, అన్న పానీయాలు వదలినా నేను సత్య ధర్మాన్ని వదలను" అన్నారు.

మహనీయ సఅద్ ఆంతర్యంలో ఉన్న సత్యమే నోటి ద్వారా వెలువడింది. వాళ్ళ అమ్మ ఎంతో ప్రభావితురాలయ్యారు. కడకు ఇస్లామ్ స్వీకరించారు.

ఎట్టకేలకు మహనీయ సఅద్(ర) విశ్వాస బలిమి, ఇస్లామ్ సత్యత ఆధారంగా ఈ గడ్డు పరీక్షలో నెగ్గి బయట పడ్డారు.

### ఇస్లామ్ స్వీకారం

మహనీయ సఅద్(ర) తన ఆప్త మిత్రుడు మహనీయ అబూ

బక్ర్(ర) ఉపదేశం, మార్గ బోధన వల్ల ఇస్లామ్ స్వీకరించారు. ఆయన చెప్పిన ఒక ఉల్లేఖనం ప్రకారం ఆయన విశ్వాసం గైకొన్నవారిలో మూడవవారు. అప్పుడు ఆయన వయసు 17 సంవత్సరాలు. ఇస్లామ్ ప్రారంభంలో మూడు ఏండ్ల వరకు బహిరంగంగా ఇస్లామ్‌ను ప్రకటించే అనుమతి లేకపోయింది. మూడేళ్ళ తరువాత ఎవరెవరు ఇస్లామ్ స్వీకరించారో అందరికీ తెలిసిపోయింది. అప్పుడే మహనీయ సఅద్ తల్లి హమ్నా, పైన పేర్కొన్న ప్రతిక్రియ ముందుకు వచ్చింది.

కొందరికి మహనీయ సఅద్(ర) ఇస్లామ్ స్వీకరించిన వారిలో మూడవ వారు కావడం, ఆయన తల్లి మూడేళ్ళ తరువాత నిరసన తెలుపడంలో అసంగతం అనిపిస్తుంది. కాని జరిగింది అదే. ఈ సందర్భంలో ఆ కాలంలో మక్కా వాతావరణం దృష్టిలో ఉంచుకుని అర్థం చేసుకోవలసి ఉంటుంది.

ఆనాటి పరిస్థితుల అవగాహనకు ఒక ఉదంతం చాలు.

## కష్ట కాలంలోని ఓ ఉదంతం

ఇస్లామ్ ఆరంభమయి ఇంకా మూడేళ్ళు కాలేదు. సత్య ఉద్యమం ఇంకా గోప్యంగానే సాగుతోంది. ఇంకా ప్రకటితంగా సందేశ ప్రచారం జరగటంలేదు. ఆ రోజుల్లో ప్రవక్త మహనీయులు షు'బె అబీ తాలిబ్‌లో ఒక చోట కూర్చుని ఉన్నారు. అప్పుడు మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్(ర) వచ్చి ఇలా చెప్పారు,

"ప్రవక్తా! ఒక వ్యక్తి, పేరు అమ్ర్ బిన్ అబస అట, సులైమ్ తెగకు చెందిన వ్యక్తి, మిమ్మల్ని కలవాలని వచ్చాడు. ఖురైషీలు సాగిస్తున్న కష్టాల పరంపర అతనికి తెలుసు, అందువల్ల ఎవరినీ స్వేచ్ఛగా అడగనూ లేడు. యాదృచ్ఛికంగా నన్ను కలిసినప్పుడు నేను జాగ్రత్తగా మాట్లాడాను. అతన్ని ఓ చోట నిలబెట్టాను. మీరు అనుమతి ఇస్తే పిలుచుకు వస్తాను."

ప్రవక్తశ్రీ(స), "నీవు బయటికి వెళ్ళి సంజ్ఞ చెయ్యి, అతను వస్తాడు. కాస్సేపయిన తరువాత నీవు కూడా వచ్చేయ్యి" అన్నారు.

ఆ తరువాత అమ్ర్ బిన్ అబస ఆయన వద్దకు వచ్చేశారు. వచ్చీ రాగానే, "మీరెవరు?"అని అడిగారు.

"నేను దేవుని సందేశహరుణ్ణి" అన్నారు దైవ ప్రవక్త(స).

అమ్ర్ అడిగారు, "సందేశహరుడంటే అర్థం ఏమిటి?" అని.

"అల్లాహ్, తన దాసులయిన మానవుల కొరకు నాకు సందేశం ఇచ్చి పంపాడు" అని చెప్పారు.

"అల్లాహ్ పంపిన సందేశం ఏమిటి?" అమ్ర్ మళ్ళీ అడిగారు.

"దైవం నా చేత పంపిన సందేశం, బంధువుల హక్కు సక్రమంగా అందజేయాలి, విగ్రహారాధన విసర్జించాలి, దేవుడు ఒక్కడే అని విశ్వసించాలి, ఆయన హక్కుల్లో, గుణగణాల్లో, ఆరాధనలో మరెవరినీ జత చేయరాదు అన్నది" అని వివరించారు ప్రవక్తశ్రీ(స).

అమ్ర్ అడిగారు, "ఈ మాటల్ని ఎందరు స్వీకరించారు?"

"చాలా తక్కువ మంది, వీరిలో ఒకరు స్వతంత్ర వ్యక్తి అబూబక్ర్(ర), మరొకరు బానిస బిలాల్ (ర) కూడా ఉన్నారు" అని చెప్పారు ప్రవక్తశ్రీ(స).

వెంటనే అమ్ర్, "దైవ ప్రవక్తా! నేను మీ సందేశాన్ని స్వీకరిస్తున్నాను, మరి మీ సన్నిధిలో ఉండాలని కోరుకుంటున్నాను" అన్నారు.

ప్రవక్తశ్రీ(స), "ప్రస్తుతం ఇది అసాధ్యమయిన విషయం. నేను ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నానో, జనులు ఎలా ఉన్నారో నీవు గమనించే ఉంటావు. అతి త్వరలో నా సందేశ విజయం గురించి వినగలవు, అప్పుడు నా వద్దకు వచ్చెయ్యి. ప్రస్తుతం నా సందేశం పట్ల నీ విశ్వాసం చాలు. వెళ్ళు, చెప్పినట్లు చెయ్యి" అని సముదాయించారు.

అమ్ర్ బిన్ అబస అక్కడి నుంచి బయటికి వచ్చేశారు. మహనీయ సఅద్(ర) జాగ్రత్తగా పరిస్థితుల్ని పరిశీలించ సాగారు. ఒకరిద్దరు సహచర మాన్యులు మహనీయ సఅద్ తోపాటు బయట పడి అమ్ర్ బిన్ అబస కంటికి దూరమయిన తరువాత మెల్లిగా నడుచుకుంటూ వీధి చివరన ఓ మూలలో నమాజ్‌లో నిమగ్నమయ్యారు.

బహుదైవారాధకులు సతతం కాచుకుని ఉండేవారు, వారి కంట పడగానే వచ్చి వారి మీద రాళ్ళు రువ్వసాగారు. సాధారణంగా ముస్లిములు వదిలేసేవారు, కాని దుష్టుల దౌర్జన్యం రాను రాను ఇంకా పెచ్చరిల్లుతోంది. యాదృచ్ఛికంగా, మామూలుకు భిన్నంగా ముస్లిములకు కోపం వచ్చింది. ఏదో కఠోర మాట పలికారు, ఒక అవిశ్వాసి ఓ ముస్లిమ్ వ్యక్తిని పట్టుకున్నాడు. ఇది చూసి మహనీయ సఅద్ కొరడాతో అతనిపై ఓ దెబ్బ వేశారు. అంతే, తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తి పెద్దగా కేకలు వేసుకుంటూ పరిగెత్తాడు. ఒక ముస్లిమ్

ఓ తిరస్కారి రక్తం చిందించిన సంఘటన ఇస్లామ్ చరిత్రలో ఇది మొదటిది.

## దైవ భీతి

ప్రవక్త కాలంలో ప్రథమంగా ముస్లిములయిన వారి విశ్వాసం ఎంతో బలీయమయినది, తేజోవంతమయినది. ఈమాన్ (విశ్వాస) వెలుగు మానవ ఆంతర్యాన్ని జ్యోతిర్మయం చేస్తుంది. అతనిలో అత్యంత సునిశిత బుద్ధి జనిస్తుంది. ఈ యదార్థాన్ని ప్రవక్త మహనీయులు ఇలా తెలిపారు, "విశ్వాసి వివేచనాశక్తికి భయపడండి!" దివ్య కుర్‌ఆన్ వారి భాషలోనే అవతరిస్తోంది. ఆ కాలంలోనయితే సహచర మాన్యుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ప్రవక్తశ్రీ(స) స్వయంగా వారి మధ్యన ఉన్నారు. ఈ వాతావరణంలో దివ్య గ్రంథంలో ఈ వచనం అవతరించింది:

వాస్తవానికి నెమ్మది, ప్రశాంతత విశ్వసించిన వారికే స్వంతం, రుజుమార్గాన ఉన్నవారు కూడా వారే, వారు విశ్వసించారు, తమ విశ్వాసాన్ని అత్యాచారంతో మలినమూ చెయ్యలేదు.

*(అల్ అన్‌ఆమ్ 6 : 82)*

"తమ విశ్వాసాన్ని అత్యాచారంతో మలినం చెయ్యలేదు" అన్న వాక్యం చూసి సహచర మాన్యులలో కొందరు అపోహకు గురయ్యారు. ఇక్కడ అత్యాచారం అంటే పాపం అని అనుకున్నారు. వీరిలో మహనీయ సఅద్(ర) కూడా ఉన్నారు. ఆయన ఆందోళన చెంది ప్రవక్త మహనీయుల సన్నిధికి వచ్చి అడిగారు, "దైవ ప్రవక్తా! మాలో 'నేను ఎటువంటి పాపం చేసి ఎరుగను' అని ఎవరు అనగలరు?" అని అడిగారు. దాని మీదట ఈ వచనం అవతరించింది:

"నిస్సందేహంగా బహుదైవారాధన (షిర్క్) చాలా పెద్ద అత్యాచారం."

అంటే దివ్యకుర్‌ఆన్ స్వయంగా విశదీకరించింది, అత్యాచారం అంటే భావం, బహుదైవారాధన అని. కనుక మీలో ఎవరయితే దైవాన్ని నమ్ముతారో వారు దేవుని అధికారాల్లో, గుణగణాల్లో, ఆయన దాస్యంలో ఎవరినీ సహవర్తులుగా యెంచరాదు. అప్పుడు మీకు నెమ్మది ప్రాప్తమవుతుంది, సన్మార్గాన ఉన్నవారుగా పరిగణించబడుతారు.

## మదీనాకు హిజ్రత్

మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్(ర) కూడా మదీనాకు హిజ్రత్ చేసే అనుమతి లభించగానే హిజ్రత్ చేసిన విశ్వాసులు. తొలుత మహనీయులు ముస్‌అబ్ బిన్ ఉమైర్, అబ్దుల్లాహ్ ఇబ్ను ఉమ్ము మక్తూమ్ హిజ్రత్ చేసిన తరువాత నలుగురు సహచరులు హిజ్రత్ చేశారు, వారిలో మహనీయ సఅద్ కూడా ఉన్నారు. మహనీయ సఅద్, ఆయన సోదరులు ఉమైర్ హిజ్రత్ చేసినప్పుడు వారు మదీనాలో తమ సోదరుడు ఉత్బా బిన్ అబీ వక్కాస్ ఇంట బస చేశారు.

దైవ మార్గంలో సతత సమరం సలిపిన వారిలో మహనీయ సఅద్‌కు ప్రముఖ స్థానముంది. ఆయన శూరత్వం, ధైర్య సాహసాలు ఇస్లామ్ విరోధులకు అతి భయంకర దృశ్యాలు చూపెట్టాయి. ఆయన దైవమార్గంలో బాణం వదలిన తొల్దొలి ముస్లిమ్. మక్కా నుండి తమ సర్వస్వాన్నీ వదలి వచ్చిన ముహాజిరులు, మహిళలు, పురుషులు, పిల్లలను మదీనా వంటి చిన్న నగరం పూర్తిగా ఆదరువు కల్పించలేకపోయింది. అందువల్ల ముహాజిరులు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. అయినా వారు ఏకాగ్రతతో ఇస్లామ్ పురోగతికి, ధర్మోన్నతికి అవిరళ కృషి సలిపారు. ✤


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు సర్క్యులేషన్ మేనేజర్‌కు ఫోన్ చేయండి: 9704317015**

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Bank Details**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**


Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

'చరితార్థులు'-2

# డాక్టర్ ముహమ్మద్ ఇక్బాల్ షైదాయి (1888 -1974)



91







9440241727


**బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త సయ్యద్ నశీర్ అహమ్మద్ రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం**

**భారతీయుల స్వేచ్ఛా** స్వాతంత్ర్యాల దిశగా అవిశ్రాంతంగా సాగిన పోరాటాల ప్రేరణ–స్ఫూర్తిని, అలనాటి యోధుల పోరాట పటిమ సంతరింపజేసిన అనుభవాలను రంగరించుకుని, ద్వితీయ ప్రపంచ సంగ్రామ సమయంలో యూరప్‌లోని 'అక్షరాజ్యాల' సహకారంతో ప్రవాస భారత ప్రభుత్వాన్ని, సైనిక వ్యవస్థను, ప్రసార వ్యవస్థలను, మందీమార్బలాన్నీ, సమకూర్చుకుని బ్రిటిష్ మిత్రపక్షాల బలగాలతో తలపడడానికి సిద్ధపడిన యోధులు డాక్టర్ ముహమ్మద్ ఇక్బాల్ షైదాయి. ఆయన ప్రస్తుత పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలోని సియాల్‌కోట్‌లో 1888లో జన్మించారు. ఆయన తండ్రి గులాం అలీ ఖట్టో. 1914లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన డాక్టర్ ఇక్బాల్ మాతృభూమి విముక్తి పోరాట దిశగా చురుగ్గా అడుగులు వేశారు. డాక్టర్ ముహమ్మద్ ఇక్బాల్ షైదాయి కార్యక్రమాలను నియంత్రించేందుకు 1915లో ఆంగ్ల ప్రభుత్వం ఆయనను 'ప్రమాదకర వ్యక్తి'గా ప్రకటించింది. చివరకు భారత వాయవ్య సరిహద్దు ప్రాంతం నుండి బహిష్కరించింది. 1918లో 'హిందూస్తాన్ గదర్ పార్టీ'తో డాక్టర్ షైదాయికు మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. 1920 నాటి 'హిజ్రత్ ఉద్యమం'లో పాల్గొని అయన అఫ్గనిస్తాన్ వెళ్ళారు. అక్కడ పరిస్థితులు అనుకూలించక 1922లో రష్యా వెళ్ళారు. అక్కడి నుండి టర్కీ రాజధాని అంకార, అటునుండి ఇటలీ చేరుకున్నారు. 1938 మార్చిలో హిందూస్తాన్ గదర్ పార్టీ, వజిరిస్తాన్ విప్లవకారుల ప్రతినిధిగా డాక్టర్ షైదాయి స్విట్జర్‌ల్యాండ్ లోని లూసన్ (Luson) చేరారు. అక్కడ ఇటలీ అధినేత బెనిటో ముస్సోలిని సోదరుడు ఆర్నాల్డో ముస్సోలినితో ఆయనకు స్నేహం కుదరడంతో 1941లో డాక్టర్ ఇక్బాల్ షైదాయి ఇటలీ చేరుకుని బ్రిటిష్ ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా పలు కార్యక్రమాలను చేపట్టారు. తొలుతగా 'ది ఫ్రెండ్స్ ఆఫ్ ఇండియా' అను సంస్థను ఏర్పాటు చేశారు. ఆ తరువాత 1941 ఆరంభంలో స్వతంత్ర ప్రవాస భారత ప్రభుత్వం ఏర్పాటు చేశారు. బ్రిటన్ మిత్రరాజ్యాల సైన్యాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించేందుకు 1942 జూలైలో 'ఆజాద్ హిందూస్థాన్ బెటాలి యన్' ఏర్పరచి, 'రేడియో హిమాలయా' పేరుతో ప్రసార–ప్రచార వ్యవస్థ స్థాపించారు. రెండవ ప్రపంచ యుద్ధంలో భాగంగా 1944లో బ్రిటిష్ మిత్ర రాజ్యల సైన్యాలు సిసిలీ, రోమ్‌లను స్వాధీనం చేసుకునేంత వరకు డాక్టర్ షైదాయి ప్రవాస భారత ప్రభుత్వ వ్యవహారాలు సాగించారు. 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లభించాక డాక్టర్ షైదాయి స్వదేశమైన పాకిస్తాన్ వెళ్ళారు. అటు తరువాత డాక్టర్ షైదాయి ఇటలీ వెళ్ళి, అక్కడి ట్యూరిన్ విశ్వవిద్యాలయంలో ఉర్దూ భాషాచార్యులుగా కొంతకాలం పనిచేశారు. 1964లో తిరిగి పాకిస్తాన్ చేరిన డాక్టర్ ముహమ్మద్ ఇక్బాల్ షైదాయి 1974 జనవరి 13న చివరి శ్వాస విడిచారు.

✤



# మీ ఆలోచనలే మిమ్మల్ని నిర్దేశిస్తాయి

**డా. ముహమ్మద్ హసన్,** ***అసిస్టెంట్ ప్రొఫెసర్***

మీకు వచ్చే ఆలోచనలే మిమ్మల్ని ఉన్నతమైన స్థానంలో నిలబెడతాయి. అంటే మీ జీవిత కాలంలో మీరు నేర్చుకున్న పాఠాలు, విలువలు, మీరు బాల్యంలో తీసుకున్న "శిక్షణ" మొదలైనవన్నీ మీ జీవిత కాలంలో ఏదో ఒక సందర్భంలో మిమ్మల్ని ఉన్నతమైన స్థానంలోకి తీసుకొని వెళతాయి. ఒకవేళ మీరు అలాంటి స్థానంలో లేరు అంటే అది మీ అభ్యాసన లోపం కాదు. మీరు శిక్షణను సరిగ్గా ఉపయోగించుకోలేదని అర్థం. మీరు ఎక్కడ విఫలం అయ్యారో ఈ చిన్న కథను చదవండి.

ఓ "జాలరి" నివసించే ఊరిలో ఒక కోటీశ్వరుడు కూడా వుండేవాడు. జాలరి ప్రతి రోజు సముద్రంలో వేటకి వెళ్ళి వలకి చిక్కిన చేపలను అమ్ముకొని వచ్చిన డబ్బులతో పిల్లల్ని పోషించు కునేవాడు. అలాగే "కోటీశ్వరుడు" తన దగ్గర వున్న డబ్బు మీద నియంత్రణ లేకుండా విపరీతంగా ఖర్చుపెట్టి వున్న దంతా పోగొట్టుకొని జాలరి ఇంటి పక్కన వున్న ఓ ఇంట్లోకి మారుతాడు. పేదరికంలో వున్న ఆ జాలరితో పాటు ఇతను కూడా రోజూ సముద్రంలో చేపల వేటకి వెళ్ళేవాడు. పేదజాలరి వలకి చిక్కిన చేపల్ని తన దినచర్యలో భాగంగా అమ్ముకొని కాలం వెళ్ళదీసే వాడు. అతని ఇంటి పక్కన వున్న మరొక జాలరి మాత్రం తన వలకు చిక్కిన చేపల్ని అమ్ముకొని వాటి ద్వారా వచ్చిన డబ్బుల్ని

తన కుటుంబ అవసరాలు పోను మిగిలినవి పొదుపు చేసుకునే వాడు. ఇలా రోజులు గడుస్తున్న కొద్దీ పేదజాలరి పేదవాడిలాగే ఉండిపోయాడు. పేదజాలరి ఇంటి పక్కకు మారిన మరొక "జాలరి" మాత్రం తను పోగేసుకున్న డబ్బులతో చిన్న చిన్న పడవలను, మరబోట్లను కొని ఇంకా ఎక్కువగా చేపలు పట్టి కోట్లకు అధిపతిగా మారుతాడు.

మీరు ఎలా బ్రతికారన్నది ముఖ్యం కాదు. కానీ మీ తర్వాతి తరం వారు కూడా అలాగే బ్రతకాలని కోరుకోవడం అవివేకపు ఆలోచనే అవుతుంది. ఎందుకంటే ఓ బిచ్చగాడి కుమారుడు బిచ్చగాడిగానే జీవితాన్ని ప్రారంభించాలని కోరుకోడు. మరి మీరు ఎలా ఆలోచిస్తున్నారనేది మీ ప్రణాళికలపై, మీ ఆలోచనలపై ఆధారపడి వుంటుంది. అందుకే మీ జీవితంలో నిస్సారమైన రోజుల్ని పక్కకుపెట్టి ఆలోచనలకు "వైవిధ్యాన్ని" జోడించండి. అప్పుడే మీరు మీ తర్వాత తరం వారు ఉన్నతంగా బ్రతకటానికి మీరు మార్గం వేసినవారు అవుతారు.

ఒక ప్రయోగంలో సంచలనమైన నిజాలు బయటపడ్డాయి. అవి ఏంటంటే కొద్దిమంది చిన్న పిల్లల్ని ఒక గదిలోకి పంపి అందు లోకి విష సర్పాలను వదులుతారు. ఆ పిల్లల తల్లిదండ్రులందరూ భయపడుతారు. (బహుశా మీరు కూడా ఏం జరిగిందోనని భయపడ్తూ ఉండొచ్చు) పిల్లలు "భయపడలేదు" పైగా వాటితో ఆడుకున్నారు కూడా. వాటిని బొమ్మలుగా భావించి సరదాగా కాలక్షేపం చేశారు. ఈ ప్రయోగం ద్వారా మనస్తత్వవేత్తలు తెల్సుకున్నదేమిటంటే మనం పుట్టింది రెండే రెండు భయాలతో. అందులో ఒకటి పెద్ద పెద్ద శబ్దాలతో వచ్చే "భయం", రెండోది ఎత్తుగా వున్న ప్రదేశాలు, ఇవే మనల్ని సహజంగా భయపెడ్తాయి. ఇక మిగిలిన భయాలన్నీ మనం నేర్చుకున్నవే. అందులో నిబంధ నలు, (Conditions) రెండోది కార్యక్రమాల (Programmes) ద్వారా వచ్చే భయాలు. "నిబంధనల" ద్వారా వచ్చే భయం ఏమిటంటే పాము కరుస్తుందని, పులి చంపుతుందని, నిప్పు కాలుతుందని ఇవి మనం మన పూర్వీకుల ద్వారా తెల్సుకున్నవి. రెండోది కార్యక్రమం ద్వారా వచ్చే "భయం" ఇవి అసహజాలు, యుద్ధాలు, వరదలు, సునామీలు మొదలైన వాటి వల్ల వచ్చే ప్రమాదాలు మొదలైనవి. "భయం" అనేది కేవలం మనం వ్యక్తం చేసే స్పందన (Response) "చర్య" Action. మాత్రమే. అందుకే అందరూ ఒకే విషయానికి భయపడరు. Fear of Failure, Fear of Judgement. అసలు ఏదైనా పనిని ప్రారంభించాలంటే "భయం". వాస్తవానికి మన జీవిత అనుభవాల్నించి మనం చాలా నేర్చుకుంటాం. ఆ అనుభవాల్లోంచి వారసత్వంగా వచ్చిందే భయం (Fear).

కాబట్టి "భయం" అనేది కూడా మన ఆలోచనల్లోంచి వచ్చేదే. దానికి అతిగా భయపడితే మనం ఏమీ సాధించలేం. పైగా ప్రతీచోట ఏదో జరుగుతుందనే "భయం" వెంటాడుతుంది కూడా. ఒకే పేరున్న ఇద్దరు వ్యక్తులు మెడికల్ చెకప్ చేయించుకో వాలని హాస్పిటల్‌కి వెళ్తారు. డాక్టర్ వారిద్దరికీ రకరకాల పరీక్షలు చేసి ఆ ఇద్దరిలో ఒకరిని పిలిచి నీకు "క్యాన్సర్" సోకింది, త్వరలో నువ్వు చనిపోతావ్ ఎలాంటి ఆలోచనలు చేయకుండా మిగిలిన సమయాన్ని ప్రశాంతంగా భార్యా పిల్లలతో గడపు అంటాడు. రెండో వ్యక్తిని పిలిచి మీకు చేసిన పరీక్షలు అన్నీ నార్మల్‌గానే వచ్చాయి. మీరు సంపూర్ణ ఆరోగ్యంతో వున్నారు అని చెప్పి పంపిస్తాడు. వాస్తవంగా జరిగినదేమంటే డాక్టర్ వద్ద వున్న రిపోర్టులు తారుమారై (పేర్లు ఇద్దరివి ఒకటే కావడం వల్ల) ఆరోగ్యంగా వున్న వ్యక్తికి "క్యాన్సర్" అని చెప్తాడు. క్యాన్సర్ తో వున్న వ్యక్తికి ఆరోగ్యంగా ఉన్నావని చెప్తాడు. చివరికి జరిగినదేమిటంటే ఆరోగ్యంగా వున్న వ్యక్తికి డాక్టర్ ఎప్పుడైతే "క్యాన్సర్" అని చెప్పాడో ఆ క్షణం నుండే అతడిలో భయంతో కూడిన "నెగెటివ్ ఆలోచనలు" మొదలయ్యాయి. అతడు ప్రతిరోజు "భయం"తోనే గడిపి వారం రోజుల్లోనే చనిపోతాడు. వాస్తవంగా "క్యాన్సర్" వున్న వ్యక్తి డాక్టర్ ఆరోగ్యంగా వున్నావని ఎప్పుడైతే చెప్పాడో ఆ క్షణం నుండే అతడిలో "ఆత్మ విశ్వాసం" రెట్టింపుగా పనిచేసింది. అతడు ఇంకా జీవించే వున్నాడు. కానీ మొదటి వ్యక్తి మాత్రం ఇతని కన్నా ముందే చనిపోయాడు. చూశారా, దీని ద్వారా మీకు ఏం అర్థమై వుంటుంది. "మీ ఆలోచనలే మిమ్మల్ని ప్రతిక్షణం మార్గదర్శనం చేస్తాయి". అవి "నెగెటివ్ ఆలోచనలైతే" వాటి "ఫలితం" కూడా అలాగే వుంటుంది. "పాజిటివ్" ఆలోచనలైతే వాటి ద్వారా వచ్చే ఫలితం మిమ్మల్ని ఇంకా ముందుకు నడిపిస్తుంది. కాబట్టి స్వార్థం, అసూయ, ఈర్ష్య, భయం, కోపం, ద్వేషం, పగ, ప్రతీకారం మొదలైనవన్నీ మనిషి యొక్క సహజ ఉద్వేగాలు (ఆలోచనలు). వీటిని నియంత్రించుకొని గొప్పవారిగా ఎదిగిన వారి గురించి వ్రాయాలంటే ఈ వ్యాసం నిడివి పెరుగుతుంది. కాబట్టి నెగెటివ్ "ఆలోచనలు" పక్కన పెట్టి తన ఆలోచనలు కార్యరూపం దాల్చా లని ఆలోచించేవాడే ఉన్నతుడు. మీరూ అలాగే ఉండటానికి ప్రయత్నం చేయండి. ఎవరికీ హాని చేయవద్దని మీరు ఆలోచి స్తున్నారంటే మీరు జీవితంలో విజయం సాధించడానికి అడుగులు వేస్తున్నారని గ్రహించాలి.

★ ★ ★

# స్వాతంత్ర్యోద్యమంలో సమర సింహాలు

మదీహా అర్జుమంద్ ఖాన్

**భారతదేశ స్వాతంత్ర్యం కోసం అనేకమంది త్యాగధనులు తమ ప్రాణాలను పణంగా పెట్టారు. హిందువులు, ముస్లిములు అందరూ సమైక్యంగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. ఈనాడు మనం ఇంత హాయిగా స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామంటే దీని వెనుక అసంఖ్యాక మంది ప్రజల అలుపెరుగని పోరాటాలున్నాయి. త్యాగాలున్నాయి. బలిదానాలున్నాయి.**



**భారతదేశ స్వాతంత్ర్యం కోసం** అనేక మంది త్యాగధనులు తమ ప్రాణాలను పణంగా పెట్టారు. హిందువులు, ముస్లిములు అందరూ సమైక్యంగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. ఈనాడు మనం ఇంత హాయిగా స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నా మంటే దీని వెనుక అసంఖ్యాక మంది ప్రజల అలుపెరుగని పోరాటాలున్నాయి. త్యాగాలున్నాయి. బలిదానాలున్నాయి. పదిహేడవ శతాబ్దిలో ఆంగ్లేయులు ఈస్టిండియా కంపెనీ పేరుతో వర్తకం చేసుకుంటామని మనదేశంలో కాలుమోపారు. ఒకవైపు వ్యాపారాన్ని విస్తరించుకుంటూ, మరోవైపు అధికారం కోసం పావులు కదపడం మొదలుపెట్టారు. వర్తకం వంకతో ఇక్కడి కొచ్చిన ఆంగ్లేయుల అసలు ఉద్దేశ్యం మన దేశాన్ని ఆక్రమించు కోవడం, భారతీయుల్ని బానిసలుగా మార్చుకోవడం. దీనికోసం వారు ఎన్నో మాయోపాయాలు పన్నారు. నయానా భయానా భారతీయుల్ని తమ దారిలోకి తెచ్చుకొనే ప్రయత్నం చేశారు. స్వదేశీ పాలకుల మధ్య విభేదాలు సృష్టించి, వారి మధ్య తగువులు పెట్టి తమలో తాము కలహించుకునేలా చేశారు. 'విభజించి పాలించు' (Divide and Rule) సూత్రాన్ని కనిపెట్టింది వారే. అధికారాన్ని హస్తగతం చేసుకోవడం, కుట్రలు, కుయుక్తులు, కుతంత్రాలతో చివరికి దేశం నలుమూలలా వ్యాపించి ఇక్కడి మన సంపదను క్రమక్రమంగా వారి దేశానికి తరలించుకు పోవడం ప్రారంభించారు. ఈ పరిణామాలపై కలత చెందిన ఆనాటి ముస్లిం రాజులు వాళ్ళ ఎత్తుగడల్ని తిప్పికొట్టేందుకు తిరుగుబాటు మొదలు పెట్టారు.

సాధారణంగా 1857లో మొదటి సారిగా స్వాతంత్ర్య ఉద్యమం ప్రారంభమైందని చెబుతుంటారు. కాని అంతకన్నా ముందునుంచే స్వాతంత్ర్య ఉద్యమాలు ప్రారంభమయ్యాయని ఆంధ్రా యూని వర్శిటీకి చెందిన చరిత్ర ఉపన్యాసకులు ప్రొఫెసర్ కొల్లూరి సూర్యనారాయణ 2006 అక్టోబర్ 1వ తేదీనాటి దక్కన్ క్రానికల్‌లో రాశారు. అంటే 1857కు వందేళ్ళ క్రితమే ఆంగ్లేయులపై తొలి దెబ్బ పడింది. ఆ తొలివేటు వేసింది ముస్లిములే. 1757లోనే బెంగాల్ నవాబు సిరాజుద్దౌలా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమానికి బీజం నాటాడు. దాని పరిణామమే 'ప్లాసీయుద్ధం'. 1780లో మన విశాఖపట్నంలోని ఈస్టిండియా కంపెనీలో సూబేదారుగా పని చేస్తున్న షేఖ్ అహ్మద్‌ను మైసూరుపై దండెత్తమని అక్కడి ఆంగ్ల

అధికారులు ఆదేశించారు. కాని ఆయన వారి ఆదేశాలను బేఖాతరు చేసి, తన మద్దతుదారులతో కలిసి ఈస్టిండియా సైన్యంపైన్నే కాల్పులు జరిపాడు. మొట్టమొదటి సైనిక తిరుగుబాటుదారుడు షేఖ్ అహ్మద్. ఏ కారణం వల్లనో చరిత్ర ఈ వీరుణ్ణి విస్మరించింది.

తరువాత 1820లో ప్రారంభమైంది వహాబీ ఉద్యమం. షా ఇస్మాయిల్ షహీద్, షా అహ్మద్ బరేల్వీలు ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. వందలాది మంది ముస్లిములు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా వీరికి అండగా నిలిచి ప్రాణాలు కోల్పోయారు. ముస్లిం యోధుల తిరుగుబాటును దెబ్బ తీయకపోతే పుట్టగతులుండవని భావించిన తెల్లదొరలు హిందూ ముస్లింల మధ్య చిచ్చుపెట్టడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నాలు చేశారు. ఈ కుట్రను పసిగట్టిన ముస్లిం యోధులు హిందూ-ముస్లింల ఐక్యత కోసం మౌలానా ముహమ్మద్ బాఖర్ సంపాదకత్వంలో 'దిల్లీ ఉర్దూ అఖ్‌బార్' పేరిట ఉద్యమ పత్రికను నడిపారు. ప్రజల్లో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిలిస్తూ, హిందూ-ముస్లింల మధ్య ఐక్యతను ప్రోదిచేసి ఆంగ్లేయుల కుట్రల్ని పత్రిక బట్టబయలు చేసింది. ఐక్యతలోనే మన బలముందని, సాఫల్యం ఉందని నొక్కి చెప్పింది అఖ్‌బార్. పత్రిక ద్వారా ప్రజల్లో విప్లవ బీజాలు నాటుతూ, ఉద్యమానికి ఉసిగొల్పుతున్నారనే నెపంతో పత్రికపై, పత్రిక సంపాదకుడిపై ఆంగ్ల అధికారులు ఉక్కుపాదం మోపారు. నయానా భయానా తమ దారిలోకి తెచ్చుకోడానికి ప్రయత్నించారు. ఎన్ని నిర్బంధాలెదురైనా మౌలానా బాఖర్ ఏమాత్రం బెదరక పోయేసరికి ఆయన్ని చిత్రహింసలు పెట్టి పొట్టన పెట్టుకున్నారు ఆంగ్ల ముష్కరులు. మాతృదేశ స్వాతంత్ర్యకాంక్షను ప్రజల్లో రగిలిస్తూ, హిందూ ముస్లిం ఐక్యత కోసం పరితపించి ప్రాణాలొదిలిన సమరయోధుడు మౌలానా ముహమ్మద్ బాఖర్.

1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు (Mutiny)ను సర్ హెంర్డ్రీమిడ్ అనే ఆంగ్ల రచయిత 'అది సిపాయిల తిరుగుబాటు కాదు, ముస్లింల తిరుగుబాటు. దీనికి నారునీరు పోసి, ముందుండి నడిపించేవారు ముస్లిం పండితులు (ఉలమాలు)' అని రాశాడంటే, స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల పాత్రను మనం అర్థం చేసుకోవచ్చు.

అలాగే పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తను రాసిన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' అనే గ్రంథంలో ఈ సిపాయిల తిరుగుబాటుకు

**దేశ స్వాతంత్ర్య సమరంలో మొగల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్ పాత్ర చిరస్మరణీయం. 'నా దేశ హిందూ ముస్లిం సోదరులారా.. లేవండి. మేల్కొనండి. దేవుడు మనకు ప్రసాదించిన అనేక అనుగ్రహాల్లో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అత్యంత విలువైనవి' అంటూ ఆయన చేసే ఉద్వేగభరిత ప్రసంగాలను, రగిలించే ఉద్యమ స్ఫూర్తిని పయామె ఆజాదీ నిర్భయంగా పతాక శీర్షికల్లో ప్రచురించేది.**

అసలు ప్రేరణ ముస్లిములే అని, స్వాతంత్ర్యోద్యమానికి ఆద్యులు వారేనని రాశారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎక్కువగా పోరాడింది ముస్లిములే, ఆస్తినష్టం, ప్రాణనష్టం ఎక్కువగా సంభవించింది కూడా వారికే. ఆ సమయంలో ఒక్క ఢిల్లీలోనే 27000 మంది ముస్లిములు దేశం కోసం ప్రాణాలు కోల్పోయారు.

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మరో ముద్దుబిడ్డడు మౌల్వీ సయ్యద్ అలావుద్దీన్. ఈయన హైదరాబాదులోని చరిత్రాత్మకమైన మక్కా మసీదు ఇమామ్‌గా సేవలందించారు. వందలాదిగా ముస్లింలను సమావేశపరిచి, వారిలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించేవారు. ఉద్యమంలో భాగంగా ఒకరోజు 500 మందితో కలసి హైదరాబాదులోని ఆంగ్ల సైన్యాధికారుల నివాసాలపై దాడి చేశారు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో మొదలైన పోరాటం తెల్లవారే వరకూ కొనసాగింది. చివరికి ఆంగ్లేయుల సైనిక శక్తి అంచనాలకు మించి ఉండడంతో వ్యూహాత్మకంగా వెనుకడుగు వెయ్యాల్సిన పరిస్థితి ఎదురైంది. ఈ సంఘటన అనంతరం మౌల్వీ సయ్యద్ అలావుద్దీన్‌ను అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిగా పరిగణించి, ఆయన్ని పట్టిచ్చిన వారికి నలభై వేల రూపాయల భారీ బహుమానం ప్రకటించారు. ఆనాడు నలభైవేలంటే ఈనాడు బహుశా ఆ మొత్తం కోట్లల్లోనే ఉంటుంది. ఆంగ్లేయుల ఈ పన్నాగం ఫలించి మౌల్వీ అలావుద్దీన్‌ను ఖైదీగా పట్టుకోవడం జరిగింది. తరువాత ఆయన్ని అండమాన్ నికోబార్ లోని 'కాలాపానీ' అనే జైలుకు తరలించి నానా హింసలు పెట్టి చంపివేశారు.

తెల్లదొరల పెత్తనానికి వ్యతిరేకంగా, భారతీయుల విముక్తి కోసం ప్రాణాలకు తెగించి పోరాడి, అండమాన్ నికోబార్‌లోని

'కాలాపానీ' జైలులో భయంకర శిక్షలు అనుభవించి ప్రాణాలు అర్పించిన మొట్టమొదటి భారతీయుడు మౌల్వీసయ్యద్ అలావుద్దీన్ మాత్రమే. ఆంగ్లేయులను అడుగడుగునా ముప్పు తిప్పలు పెట్టి, పంటికింద రాయిలా మారిన మౌల్వీ అహమదు ల్లాహ్ షా ఫైజాబాదీని సజీవంగా కాని, నిర్జీవంగా కాని పట్టిచ్చినవారికి వేల రూపాయల నజరానా ప్రకటించింది ఈస్టిండియా కంపెనీ. ఒక ద్రోహి ఆంగ్లేయులు కక్కిన కూటికి ఆశపడి మౌలానాకు ద్రోహం తలపెట్టాడు. దీంతో, ఉత్తర భారతదేశంలో ఒక ప్రధాన శత్రువు అడ్డు తొలగిపోయింది అని బ్రిటిష్ వాళ్ళు సంబరపడ్డారు. స్వదేశీ పాలకుల మధ్య ఐక్యత కోసం పరితపిస్తూ, లేఖల ద్వారా కార్యోన్ముఖుల్ని చేసిన మరో యోధుడు అజీముల్లాఖాన్. నానాసాహెబ్‌కు వెన్నంటి నిలిచి, సమర వ్యూహాన్ని రచించారు. 'పయామె ఆజాదీ' అనే పత్రికను హిందీ, ఉర్దూ భాషల్లో నడిపారు. ఉద్యమ చైతన్యానికి ప్రతీకగా నిలిచిన ఆ పత్రిక వేలాది మందిలో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చింది. దేశ స్వాతంత్ర్య సమరంలో మొగల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్ పాత్ర చిరస్మరణీయం. 'నా దేశ హిందూ ముస్లిం సోదరులారా.. లేవండి. మేల్కొనండి. దేవుడు మనకు ప్రసాదించిన అనేక అనుగ్రహాల్లో స్వేఛ్ఛా స్వాతంత్ర్యాలు అత్యంత విలువైనవి' అంటూ ఆయన చేసే ఉద్వేగభరిత ప్రసంగాలను, రగిలించే ఉద్యమ స్ఫూర్తిని పయామె ఆజాదీ నిర్భయంగా పతాక శీర్షికల్లో ప్రచురించేది.

అంతేకాకుండా మౌలానా లియాఖత్ అలీఖాన్, హిక్మతుల్లాఖాన్, ముహమ్మద్ బఖ్త్ ఖాన్, ఖాన్ బహదూర్ ఖాన్ బక్షిష్ అలీ, ఖాన్ అబ్దుల్ గఫ్ఫార్ ఖాన్, తుర్రెబాజ్ ఖాన్, మౌలానా ఆజాద్ లతోపాటు అసంఖ్యాకమంది ముస్లిం యోధులు దేశం కోసం అనుపమానమైన త్యాగాలు చేశారు. తృణప్రాయంగా ప్రాణాలను అర్పించారు.

దేశాన్ని బానిస బంధనాల నుండి విముక్తి కల్పించే ఈ స్వాతంత్ర్య పోరాటంలో అనేకమంది ముస్లిం మహిళలు కూడా అనుపమాన త్యాగాలు చేశారు. ఆబాదీబానూ, బేగం హజ్రత్ మహల్, బేగం అజీజున్, హమీదాబేగం, బేగం రహీమా, బేగం హబీబా, బేగం అజీజున్, అజ్గరీబేగం లాంటి ఎందరో వీరవనితలు తమ జీవితాలను ధారపోశారు. బ్రిటిష్ ముష్కరుల కబంధ హస్తాల నుండి దేశాన్ని రక్షించడానికి కదన రంగంలోకి దూకిన ధీరవనిత బేగం హజ్రత్ మహల్. స్వయంగా ఏనుగు అంబారీపై స్వారీ చేస్తూ, యుద్ధ రంగంలో ఆంగ్లేయులపై శివంగిలా విరుచుకు పడిన వీరనారి. పాతికేళ్ళ పడుచు ప్రాయంలోనే ఇద్దరు బిడ్డలు

**బ్రిటిష్ ముష్కరుల కబంధ హస్తాల నుండి దేశాన్ని రక్షించడానికి కదన రంగంలోకి దూకిన ధీరవనిత బేగం హజ్రత్ మహల్. స్వయంగా ఏనుగు అంబారీపై స్వారీ చేస్తూ, యుద్ధ రంగంలో ఆంగ్లేయులపై శివంగిలా విరుచుకుపడిన వీరనారి. పాతికేళ్ళ పడుచు ప్రాయంలోనే ఇద్దరు బిడ్డలు కలిగి, భర్త మరణించినా పునర్వివాహం కూడా చేసుకోకుండా భారత భూమి సంకెళ్ళు తెంచడానికి దేశసేవకు అంకితమైన మహిళ ఆబాదీబానూ. తన ఇద్దరు కొడుకులకూ ఉగ్గు పాలతోనే విప్లవ భావాలు రంగరించి పోసి సమర రంగానికి పంపిన ధీశాలి ఆమె. మౌలానా ముహమ్మద్ అలీ, మౌలానా షౌకత్ అలీ ఆబాదీబాను ముద్దుబిడ్డలే. స్వాతంత్ర్యోద్యమంలో ఈ ఇద్దరు అలీ సోదరుల పాత్ర అజరామరం.**

కలిగి, భర్త మరణించినా పునర్వివాహం కూడా చేసుకోకుండా భారత భూమి సంకెళ్ళు తెంచడానికి దేశసేవకు అంకితమైన మహిళ ఆబాదీబానూ. తన ఇద్దరు కొడుకులకూ ఉగ్గు పాలతోనే విప్లవ భావాలు రంగరించి పోసి సమర రంగానికి పంపిన ధీశాలి ఆమె. మౌలానా ముహమ్మద్ అలీ, మౌలానా షౌకత్ అలీ ఆబాదీబాను ముద్దుబిడ్డలే. స్వాతంత్ర్యోద్యమంలో ఈ ఇద్దరు అలీ సోదరుల పాత్ర అజరామరం. ఉద్యమ ప్రస్థానంలో మహాత్మాగాంధీ ఆబాదీబానూను అనేకసార్లు కలుసుకున్నారు. గాంధీజీ ఆమెను అమ్మా అని పిలిచేవారు. ఉద్యమానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని కూడా ఆమె గాంధీజీకి అందించేవారు. స్వయంగా గాంధీజీయే ఆమెను అమ్మా అని సంబోధించడంతో ప్రజలంతా ఆమెను అమ్మా అని పిలుచుకునేవారు. దీంతో ఆమె బీబీ అమ్మాన్‌లుగా ప్రసిద్ధిగాంచారు. వయసు మీదపడినా, అనారోగ్యం వేధించినా ఆమె స్వాతంత్ర్య పోరాటం నుండి వీసమెత్తు కూడా వెనక్కి తగ్గలేదు. 'హోమ్ రూల్' ఉద్యమంలో ఈమె కీలకపాత్ర పోషించారు. ఆబాదీబాను పోరాట పటిమను, మొక్కవోని ధైర్య సాహసాలను చూసి ఆంగ్లేయులు ఈమె చాలా ప్రమాదకరమైన మహిళ అని ప్రకటించారు. ఈ విధంగా భారతదేశ స్వాతంత్ర్యం కోసం వేలాదిమంది ముస్లింలు ప్రాణ త్యాగాలు చేశారు. కాని ఆశ్చర్యకర విషయం ఏమిటంటే, దేశం

**కాని ఆశ్చర్యకర విషయం ఏమిటంటే, దేశం కోసం, దేశరక్షణ కోసం, బానిస బంధనాల నుండి దేశాన్ని విముక్తిచేయడం కోసం ఇన్ని త్యాగాలు చేసి, తమ సర్వస్వాన్నీ ధారపోసిన ముస్లింలను ఈనాడు తమ సొంతగడ్డపైనే అనుమానపు దృష్టితో చూడడం జరుగుతోంది. స్వతంత్ర భారతావనిలో వారు పరాయి వారుగా చూడబడుతున్నారు. మతోన్మాద శక్తులు చరిత్రను వక్రీకరించి, దుష్ప్రచారం చేస్తూ ముస్లిం ముక్త్ భారత్ అనే స్థాయికి వెళ్ళాయంటే, దేశం ఎంత ప్రమాదకర దిశ వైపునకు వెళుతుందో అర్థం చేసుకోవచ్చు.**

కోసం, దేశరక్షణ కోసం, బానిస బంధనాల నుండి దేశాన్ని విముక్తిచేయడం కోసం ఇన్ని త్యాగాలు చేసి, తమ సర్వస్వాన్నీ ధారపోసిన ముస్లింలను ఈనాడు తమ సొంతగడ్డపైనే అనుమానపు దృష్టితో చూడడం జరుగుతోంది. స్వతంత్ర భారతావనిలో వారు పరాయి వారుగా చూడబడుతున్నారు. మతోన్మాద శక్తులు చరిత్రను వక్రీకరించి, దుష్ప్రచారం చేస్తూ ముస్లిం ముక్త్ భారత్ అనే స్థాయికి వెళ్ళాయంటే, దేశం ఎంత ప్రమాదకర దిశ వైపునకు వెళుతుందో అర్థం చేసుకోవచ్చు.

ఆనాడు దేశ స్వాతంత్ర్యం కోసం అందరూ కలసికట్టుగా పోరాడుతుంటే, ఉద్యమంలో రవ్వంత కూడా భాగస్వామ్యం లేకుండా ఆంగ్లతొత్తులుగా ఉన్నటువంటి 'పరివార్' శక్తులు ముస్లింల దేశభక్తిని శంకిస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. ఇది పెద్ద విషాదం. అంతేకాదు, కుల మతాలకు అతీతంగా యావద్దేశ ప్రజలు అనేక త్యాగాలు చేసి కలసి సాధించుకున్న ఈ దేశం ఏమైపోనుందో అన్న భయం కూడా ఈనాడు దేశ ప్రేమికుల్లో నెలకొని ఉంది. మోడీ సారథ్యంలో ఒకదాని వెంట ఒకటి వేగంగా జరిగిపోతున్న పరిణామాలు ఆ భయాన్ని మరింత పెంచేవిగా ఉన్నాయి. ఆలోచనాపరులు, మేధావులు, లౌకిక, ప్రజాస్వామికవాదులు, యావద్దేశ బహుజనులు ఏకతాటిపై నిలిచి మతోన్మాద శక్తుల నుండి దేశాన్ని కాపాడడం కోసం నిర్మాణాత్మకమైన, ఆచరణాత్మకమైన కార్యాచరణ పథకాన్ని రూపొందించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇది ఈనాటి తక్షణ కర్తవ్యం. ✤

# ఇతరులతో వ్యవహరించేందుకు పది సూత్రాలు

మానసిక వికాసం



మంగళగిరి జీలాని

విజయవంతంగా జీవితం గడపటానికి ఉపాయాలు చెప్పిన డాక్టర్ ఎన్.వి.పీలే పుస్తకాలు ఎందరినో ఆకర్షించి, ప్రేరణ నిచ్చాయి. ఇతరులతో మంచిగా వ్యవహరించడంపై ఆయన రాసిన సూత్రాల్లో కొన్నింటిని చూద్దాం.

1) ప్రతి వ్యక్తికీ తన పేరు ఎంతో ముఖ్యమైనది. కనుక వ్యక్తుల పేర్లను గుర్తుంచుకొని పిలవండి (సమావేశాల్లో, ఆఫీసు మీటింగ్‌లు... మొదలైనవి)

2) మీ చుట్టూ ఉన్న పరిసరాలు ఉద్రేకభరితం కాకుండా చూసుకోండి. రిలాక్స్‌గా సౌకర్యవంతంగా, ఆనందంగా ఉండండి.

3) ప్రతి చిన్న విషయానికీ బాధపడకుండా, భయపడకుండా వాటిని తేలిగ్గా తీసుకోండి. ధైర్యంగా ఎదుర్కోండి.

4) 'నాకన్నీ తెలుసు' అని అహంకారంగా ఉండకండి. తెలియనివి, మంచి విషయాలు నేర్చుకునే అలవాటు చేసుకోండి.

5) ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం అలవరచుకోండి. ఇతరులను ఉత్తేజపరిచేలా ఉండండి.

6) మర్యాదపూర్వకంగా, హుందాగా, ఉపయోగకరంగా ప్రవర్తిస్తూ మీ చెడు గుణాలను మెల్లగా దూరం చేసుకోండి.

7) మీ వల్ల ఏర్పడిన అపార్థాలను, కష్టాలను పరిష్కరించేందుకు నిజాయితీగా ప్రయత్నిస్తూ మీ చుట్టుపక్కల ప్రేమ, ఆప్యాయత, శాంతిని నెలకొల్పే ప్రయత్నాలు చేయండి.

8) ఇతరుల పొరపాట్లను చూసీచూడనట్లు వదిలేయండి. ఇతరుల్ని ఇష్టపడే అలవాటు మెల్లమెల్లగా నేర్చుకోండి.

9) ఇతరుల్ని ప్రోత్సహించండి, గౌరవించండి. వారి (మంచి) పనిని సమర్థించండి, మెచ్చుకోండి. మీరెందుకు ప్రశంసిస్తున్నారో తెలియజేయండి. సద్విమర్శ చేయండి.

10) ఆధ్యాత్మికతను అలవరచుకొని, ఇతరులకు తెలియ చెప్పగలిగే మంచి విషయాలను, సమాచారాన్ని తెలుసుకోండి.

పైన చెప్పిన వాటిలో కొన్నింటినైనా చేస్తున్నారా లేదా? మిమ్మల్ని మీరు మెరుగుపరచుకోండి. వీటిపై కనీసం ప్రయత్నమైనా చెయ్యడం చాలా ముఖ్యమైన అంశం. ఇవాళే ప్రారంభిద్దాం. సిద్ధమేనా?!

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

35 ఆయత్‌లు

# 46. అల్ అహ్కాఫ్

మక్కా అవతరణ

21 – 22 కాస్త వీరికి ఆద్ సోదరుడు (హూద్) గాథను వినిపించు. అప్పుడు అతను అహ్కాఫ్‌లో తన జాతిని హెచ్చరించాడు[25]– ఇలా హెచ్చరించేవారు మునుపు కూడా గతించారు, అతని తరువాత కూడా వచ్చారు– "అల్లాహ్ తప్ప మరెవరి దాస్యమూ చేయకండి, నాకు మీ విషయంలో ఒకానొక ప్రమాదకరమయిన దినాన వచ్చే యాతనను గురించి భయం కలుగుతోంది." వారన్నారు, "మమ్మల్ని దారి తప్పించి మా ఆరాధ్యులకు దూరం చేయడానికి నీవు వచ్చావా? సరే అయితే నీవు మమ్మల్ని భయపెడుడూ ఉన్న ఆ నీ యాతన ఏదో తీసుకు రా, నీవు నిజమే పలుకుతున్నట్లయితే."

25. ఖురైష్ నాయకులు తమ పెద్దరికపు దురభిమానంలో పడి ఉండటం చేత, తమ సంపద, నాయకత్వం పట్ల ఉబ్బితబ్బిబ్బవడం చేత ఇక్కడ వారికి 'ఆద్' జాతి గాథను వినిపించడం జరుగుతోంది. వీరిని గురించి అరేబియాలో బాగా ప్రతీతి పొందిన విషయం, పూర్వకాలం ఈ భూభాగంలో అందరినీ మించిన బలం గల జాతి అన్నది.

(అహ్కాఫ్) అన్నది(హిక్ఫ్) అన్న దానికి బహు వచనం. దీని శాబ్దిక అర్థం, నిడువయిన ఇసుక తిన్నెలు, ఎత్తులో కొండల ఎత్తుకు చేరకపోయినటువంటివి అన్నది. కాని పారిభాషికంగా ఇది అరేబియా ఎడారి (అర్రబఉల్ ఖాలి)కి నైరుతి దిశలోని భూభాగానికి పేరు. అక్కడ నేడు ఎటువంటి జనావాసం లేదు. పటంలో దాని స్థానం గమనించండి.

ఇబ్ను ఇస్‌హాక్ ప్రకారం, ఆద్ ప్రాంతం ఉమాన్ నుండి యమన్ వరకు విస్తరించి ఉండేది. దివ్య ఖుర్‌ఆన్ మనకు తెలిపేదాన్నిబట్టి వీరి అసలు స్వదేశం అల్ అహ్కాఫ్ ప్రాంతం. అక్కడి నుండి వారు వ్యాప్తి చెంది చుట్టుపట్లనున్న దేశాలకు చేరి బలహీన జాతులను ఆక్రమించుకున్నారు. నేటికాలంలోనూ దక్షిణ అరేబియా వాసులలో, ఆద్ ఈ ప్రాంతంలోనే నివసించారన్నమాట ప్రతీతి పొంది ఉంది. నేటి పట్టణం "ముకల్లా" నుండి దాదాపు 125 మైళ్ళ దూరంలో ఉత్తర దిశన "హజర మౌత్" అనే ప్రాంతం ఒకటుంది. అక్కడ జనులు ''హజ్రత్ హూద్'' సమాధి నిర్మించిపెట్టారు. అది "హూద్ సమాధి" పేరుతోనే ప్రసిద్ధమయి ఉంది. ప్రతి సంవత్సరం షాబాన్ 15న అక్కడ 'ఉర్స్' జరుగుతుంది. అరేబియాలోని విభిన్న ప్రాంతాల నుండి వేనవేల ప్రజలు అక్కడ సమావేశమవుతారు. ఈ సమాధి చారిత్రకంగా నిర్ధారితం కాకపోయినా అక్కడ దాన్ని నిర్మించడం, దక్షిణ అరేబియా ప్రజలు ఇతోధికంగా దాని వైపునకు మరలడం కనీసం ఒక విషయాన్ని తప్పనిసరిగా రుజువు చేస్తున్నాయి. స్థానిక కథనాలు ఈ ప్రాంతాన్నే ఆద్ జాతి ప్రాంతంగా నిర్ణయిస్తాయని నిర్ధారిస్తున్నాయి. ఇదీకాక "హజర మౌత్"లో అనేక పాడుపడ్డ (Ruins) ప్రాంతాలున్నాయి. వాటిని స్థానిక ప్రజలు నేటికీ 'దార్ ఆద్' (ఆద్ ప్రాంతం) అన్న పేరుతో పిలుస్తారు.

"అల్ అహ్కాఫ్" నేడున్న పరిస్థితుల్ని చూసి, ఇక్కడ ఒకనాడు మహోజ్వలమయిన నాగరికత విలసిల్లిన బలోపేతమయిన జాతి నివసించేదని ఎవ్వరూ ఊహించనయినా లేరు. బహుశా వేల సంవత్సరాల క్రితం ఇదొక సస్యశ్యామలమయిన ప్రాంతమయి ఉంటుంది. తరువాత వాతావరణంలోని మార్పులు దాన్ని ఎడారిగా మార్చివేసి ఉంటాయి. నేడు అది దూరదూరాల వరకు జీవరాసి మచ్చుకయినా లేని అంతం కానరాని ఎడారి భూభాగం. దాని మధ్య భాగానికిపోయే సాహసం కూడా ఎవ్వరూ చేయలేరు. క్రీ.శ. 1843లో 'బలేరియా'కి చెందిన ఓ సైనికుడు దాని దక్షిణ తీరానికి చేరుకున్నాడు. అతని ప్రకారం హజర మౌత్ ఉత్తర పీఠభూమిపైన నిలబడి చూసినట్లయితే ఈ ఎడారి ఒక్క వెయ్యి అడుగుల లోతట్టు ప్రాంతంలో ఉన్నట్టు గోచరిస్తుంది. ఇందులో అనేకచోట్ల తెల్లని నేల ప్రాంతాలున్నాయి. వాటిలో ఏదయినా వస్తువు పడిపోతే అది ఇసుకలో మునిగిపోతూనే ఉంటుంది, పూర్తిగా మాసిపోతుంది. అరబ్బు పల్లెవాసులు (బద్దూ) ఈ ప్రాంతమంటే చాలా భయపడతారు. ఏ మూల్యానికయినా అక్కడికి తీసుకువెళ్ళడానికి ఆమోదించరు. ఒక సందర్భంలో ఆ సైనికుణ్ణి అక్కడికి తీసుకువెళ్ళడానికి ఎవ్వరూ సిద్ధం కాకపోతే, అతను ఒక్కడే అక్కడికి వెళ్ళాడు. అతని ప్రకారం అక్కడి ఇసుక పూర్తిగా మెత్తని పిండిలా ఉంది. నేను బహు దూరాన్నుంచి ఒక 'గుండు దారం' అందులోకి విసిరాను. అది 25 నిముషాల్లో అందులో మునిగిపోయింది. అది కట్టి ఉన్న నూలు కొన కృశించిపోయింది. సవివరంగా తెలుసుకునేందుకు చూడండి.

- ★ Arabia and the Isles, Herald Ingrams, London, 1946.
- ★ The Unveiling of Arabia, RH Kirnan, London 1937
- ★ The Empty Quarter, Phiby, London, 1933

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

### అధ్యాయం : 84
### మరణ సమయంలో దైవప్రవక్త(సఅసమ్) నోట వెలువడిన ఆఖరి మాటలు

**315)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా వివరించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఆరోగ్యవంతులుగా ఉన్న కాలంలో, "ఏ ప్రవక్త అయినా సరే, వారి ఆత్మను వశపరచుకునే ముందు స్వర్గంలో వారు నివాసముండే చోటు వారికి చూపించబడింది. పిదప వారికి (ప్రపంచం కావాలో, పరలోకం కావాలో) ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఇవ్వబడింది" అని చెబుతుండేవారు. తరువాత ఆయన(స) అస్వస్థతకు గురైన సమయంలో ఆయన(స) పవిత్ర శిరస్సు నా తొడపై ఉంది. అప్పుడే ఆయన స్పృహ కోల్పోయారు. ఆయన(స)కు స్పృహ వచ్చినప్పుడు, తన దృష్టిని ఇంటి కప్పుపైకి మరల్చి, **"అల్లాహుమ్మర్రఫీఖుల్ ఆలా"** (ఓ అల్లాహ్! నన్ను పరమోన్నత మిత్రుల వద్దకు చేర్చు) అని పలికారు. అంటే నన్ను నీ సన్నిధిలో ఉన్న దైవ ప్రవక్తలతో, సిద్దీఖులతో కలుపు అని వేడుకున్నారు. నేనప్పుడే అర్థం చేసుకున్నాను- ఆయన(స) ఇక మమ్మల్ని ఇష్టపడటం లేదనీ, పరలోకాన్నే ఇష్టపడుతున్నారని! ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఆయన(స) చెప్పిన ప్రవచనం ఆ క్షణంలో నాకు జ్ఞప్తికి వచ్చింది. హజ్రత్ ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు: ఆయన(స) మనసు తనువును వీడుతున్నప్పుడు ఆయన అధరాల మీదుగా జాలువారిన చివరి వాక్యం ఇది: "అల్లాహుమ్మర్రఫీఖుల్ ఆలా"

### అధ్యాయం : 87
### మరణ వ్యాధికి గురై ఉన్న కాలంలో దైవప్రవక్త(స) ఉసామా బిన్ జైద్ (రజి)ను సేనాధిపతిగా నియమించి పంపటం

**319)** సాలిమ్‌తో ఆయన తండ్రి (అబ్దుల్లాహ్ బిన్ ఉమర్-రజి) ఇలా అన్నారు: ప్రవక్త మహోదయులు (సఅసమ్) ఉసామా బిన్ జైద్(రజి)ను ఒక సైనిక పటాలానికి అధిపతిగా నియమించారు. కొంతమంది సహచరమాన్యులు ఈ నియామకంపై అభ్యంతరం వ్యక్తపరిచారు. ఈ సంగతి తెలుసుకున్న దైవ ప్రవక్త(స), "మీరు ఉసామా (నియామకం) పట్ల అభ్యంతరం తెలిపారని విన్నాను. వాస్తవానికి ఉసామా నాకు అందరికన్నా ప్రియతముడు."[1]

**320)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: ప్రవక్త మహోదయులు(సఅసమ్) ఒక సైనిక పటాలాన్ని సిద్ధం చేసి, దానికి సేనాధిపతిగా ఉసామా బిన్ జైద్(రజి)ను నియమించారు. జనులలో కొంతమంది ఉసామా నేతృత్వంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై దైవప్రవక్త(స) తన సహచర మాన్యులను సంబోధించి ప్రసంగిస్తూ, "ఈ రోజు మీరు ఇతని నేతృత్వంపై అభ్యంతరం తెలుపుతుంటే, ఇతని తండ్రి (జైద్) నేతృత్వంపై కూడా మీరు అభ్యంతరం తెలిపి ఉన్నారు. అల్లాహ్ సాక్షిగా! ఇతని తండ్రి (జైద్-రజి) నాయకత్వానికి తగినవాడు, నాకు అందరికన్నా ప్రియతముడు. అతని తరువాత ఇతను (ఉసామా) కూడా నాకు అందరికన్నా ప్రియతముడు."

319-1. ఆ సైనిక పటాలంలో అబూబక్ర్(రజి), ఉమర్(రజి) లాంటి అగ్రశ్రేణి ముహాజిర్ సహాబా ఉన్నప్పటికీ ఆయన(స) పిన్న వయస్కుడైన ఉసామా (రజి)ను సైన్యాధిపతిగా నియమించటం గమనార్హం. అంతకు ముందు ముతా యుద్ధంలో ఉసామా తండ్రి జైద్ బిన్ హారిసా(రజి) అమరగతి నొందారు. తండ్రిని హతమార్చిన శత్రువులపై ప్రతీకారేచ్ఛతో ఉసామా విరుచుకుపడతారని దైవప్రవక్త(స) భావించారు. అదీగాక మానవ అసమానతల్ని, నిమ్నోన్నతా భేదభావాల్ని కూడా ఇలాంటి ఉపమానాల ద్వారా రూపుమాపాలని దైవప్రవక్త(స) తలపోశారు. ఈ సైనిక పటాలం మదీనా పొలిమేరలు దాటుతుండగానే మహాప్రవక్త(స) పరమ పదించారు. సైనికులు వెనక్కి తిరిగి వచ్చి అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఆ తరువాత మొదటి ఖలీఫా హజ్రత్ అబూబక్ర్(రజి) ఈ సైన్యాన్ని సాగనంపారు. ఉసామా బిన్ జైద్ (రజి) తన తండ్రి హంతకుల్ని హతమార్చి, భారీ మొత్తంలో యుద్ధ ప్రాప్తితో సహా విజేతగా తిరిగి వచ్చారు.

★ ★ ★



# బాపూజీతో భుజం భుజం కలిపి...

**- యండి. ఉస్మాన్ ఖాన్**

**భారత స్వాతంత్ర్యోద్యమంలో అనేకమంది తమ ధన ప్రాణాలను పణంగా పెట్టారు. హిందువులూ, ముస్లిములూ భాగస్వాములై గాంధీజీతో భుజం భుజం కలిపి నడిచారు. అందులో ముస్లింల సంఖ్య లెక్కకు మిక్కిలి.** ఈ సందర్భంగా కొందరి గురించైనా తెలుసుకోవడం ఎంతైనా సముచితం. గాంధీజీ స్వగ్రామమైన పోరు బందర్‌లో దాదా అబ్దుల్లా ఆందం జవేరీ అనే ఒక ప్రఖ్యాత ముస్లిం వ్యాపారి ఉండేవారు. ఆయనకు దక్షిణాఫ్రికాలో వ్యాపారాలున్నాయి. అక్కడి తన కంపెనీ న్యాయవాదులకు సహకరించేందుకు తన గ్రామస్తుడైన గాంధీజీని దక్షిణాఫ్రికా పిలిపించుకున్నారు. అప్పటి నుండి ఆయనకు అన్ని విషయాల్లో సహకరిస్తూ మార్గదర్శిగా నిలిచారు. దక్షిణాఫ్రికాలో భారతీయులు ఎదుర్కొంటున్న జాతి వివక్షను గాంధీజీకి వివరించి, దానికి వ్యతిరేకంగా పోరాడడానికి, 'నాటల్ ఇండియన్ కాంగ్రెస్' (NIC) అనే ఒక సంస్థను ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా దాదా అబ్దుల్లా, కార్యదర్శిగా గాంధీజీ ఎంపికయ్యారు. మరికొంత మంది ప్రముఖులు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, సభ్యులుగా నియమితులయ్యారు. దాదా అబ్దుల్లా జీవించి ఉన్నంతవరకు గాంధీకి వెన్నుదన్నుగా ఉండి, ఆయనకు మార్గదర్శకులుగా నిలిచారు. 'ప్రజాసేవ చేయాలనే కోరిక, దానికి కావలసిన శక్తి నాకు దాదా అబ్దుల్లా సహచర్యంలోనే లభించాయి' అని గాంధీజీ తన ఆత్మకథలో రాసుకున్నారు.

దక్షిణాఫ్రికాలో జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన గాంధీజీ భారత దేశానికి వచ్చీరాగానే ఆంగ్లేయులకు వ్యతిరేకంగా చంపారన్ రైతాంగ పోరాటాన్ని భుజానికెత్తుకున్నారు. చంపారన్ రైతాంగ పోరాట నాయకులు షేక్ గులాబ్, ముహమ్మద్ మూనిస్ అన్సారీ గాంధీజీకి కుడి భుజంగా నిలిచి సహకరించారు. దక్షిణాఫ్రికాలో జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడి విజయుడైవచ్చిన గాంధీజీకి ఇక్కడ కూడా వివక్ష తప్పలేదు. తొలుత పాట్నాలోని బాబూ రాజేంద్రప్రసాద్ (అప్పటికాయన న్యాయవాదే) ఇంట్లోకి ఆయనకు అనుమతి లేకుండా వెళ్ళారు. ఆ సమయాన రాజేంద్ర ప్రసాద్ ఇంట్లో లేరు. బావిలో నీళ్ళు తోడుకోడానికి గానీ, ఇంటి మరుగుదొడ్డి వాడుకోడానికి గాని ఆయనకు అనుమతి లభించలేదు. ఈ విషయాలను గాంధీజీ తన ఆత్మకథలో రాసుకోవడమే కాకుండా, కొడుకు మణి లాల్ గాంధీకి ఉత్తరం ద్వారా తెలియజేశారు. అప్పుడాయనకు పాట్నా గ్రామస్తుడైన తన లండన్ సహచరుడు అడ్వకేట్ మౌలానా మజ్హరుల్ హఖ్ గుర్తుకొచ్చారు. బాబూజీ ఇంట తనకెదురైన పరిస్థితిని వివరిస్తూ ఆయనకు కబురు పెట్టారు. వెంటనే మజ్హరుల్ హఖ్ ఆఘమేఘాల మీద గాంధీజీ దగ్గరికొచ్చి, ఆయనకు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. తరువాత ఆయన చంపారన్ చేరుకొని అక్కడి రైతుల గోసను విన్నారు.

నీలిమందు సాగు చేయాలని ఆంగ్ల పాలకులు తమపై

జరుపుతున్న దౌర్జన్యాలను రైతులు గాంధీజీకి ఏకరువు పెట్టారు. చంపారన్ రైతుల్లో గాంధీజీకి ఉన్న ఆదరణ, తదనంతర పరిణామాలనూ పసిగట్టిన ఆంగ్ల అధికారి ఇర్విన్ గాంధీ అడ్డుతొలగించుకోవాలని పథకం పన్నాడు. గాంధీజీని భోజనానికి ఆహ్వానించి, ఆయనకు విషమిచ్చి చంపే బాధ్యతను తన వంట మనిషి బతఖ్ మియా అన్సారీకి అప్పగించాడు. గాంధీజీని చంపితే ఊహకు అందని బహుమతులతో సత్కరిస్తానని, లేకపోతే నరకం చూపిస్తానని భయపెట్టాడు. కాని బతఖ్ మియా తన ప్రాణాలకు తెగించి బాపూజీ ప్రాణాలు రక్షించారు. ఆంగ్లేయుల కుట్రల నుండి బాపూజీ ప్రాణాలు కాపాడి భారత స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వాన్ని అందించారు.

చంపారన్ రైతాంగ పోరాటంలో విజయం సాధించిన గాంధీజీ భారత జాతీయ ఉద్యమంలోకి దూకారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో 'అలీ బ్రదర్స్' గా ప్రసిద్ధి గాంచిన ముహమ్మద్ అలీ జౌహర్, షౌకత్ అలీ జౌహర్‌ల అండ గాంధీజీకి కొండంత బలాన్నిచ్చింది. వారితో గాంధీజీ ఎంతగా కలిసిపొయ్యారంటే, ఆబాదీ బానూకు తాను మూడవ సంతానమని చెప్పుకుంటూ, ఆమెను అమ్మా అని పిలిచేవారు. స్వాతంత్ర్యోద్యమం కోసం ఆమె గాంధీజీకి భారీ మొత్తంలో ఆర్థిక సహాయం అందించేవారు. ఉద్యమ అవసరాల కోసం గాంధీజీని ఆపద్బాంధవుడిలా ఆదుకున్న మరో సహచరుడు ఉమర్ సుభానీ. బొంబాయిలో ఏ మీటింగు జరిగినా అందులో సగానికి సగం ఖర్చు ఉమర్ సుభానీ ఒక్కడే భరించేవారు. 1921లో 'తిలక్ స్వరాజ్య నిధి'కి విరాళాలు సేకరించే సమయాన గాంధీజీకి బ్లాంక్ చెక్కు ఇచ్చి 'ఎంత కావాలో రాసుకోండి' అన్న ఉదార గుణ సంపన్నుడు సుభానీ. గాంధీజీ మరో ప్రాణ స్నేహితుడు, దక్షిణాఫ్రికా నుండి కుటుంబంతో సహా గాంధీజీ వెంట భారత దేశానికి వచ్చేసిన మిత్రుడు ఇమాం అబ్దుల్ ఖాదిర్ బావజీర్. గాంధీజీ ఆయన్ని ప్రేమగా 'ఇమాం సాబ్' అని పిలుచుకునేవారు. ఆయన సతీమణి, ఇద్దరు కుమార్తెలు కూడా ఆశ్రమంలోని ప్రెస్‌లో పని చేసేవారు. గాంధీజీ ఇమాం సాహెబ్‌ను తన సోదరునిగా పరిగణిస్తూ, ఆయన కూతురు ఫాతిమా బేగం వివాహం స్వయంగా దగ్గరుండి జరిపించారు. 1920 ఏప్రిల్ 2వ తేదీన జరిగిన ఈ వివాహ వేడుకకు సంబంధించి గాంధీజీ పేరున ప్రచురితమైన ఆహ్వాన పత్రిక భారత జాతీయోద్యమ సాహిత్య చరిత్రలో కలికితురాయిగా నిలిచిపోయింది. తను పెళ్ళిపెద్దగా వ్యవహరించి జరిపిన ఈ వివాహ విశేషాలను స్వయంగా గాంధీజీ తన 'నవ జీవన్' పత్రికలో విశేషంగా ప్రచురించారు.

గాంధీతో కలిసి నడిచిన మరో సహచరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు ఖాన్ అబ్దుల్ గఫ్ఫార్ ఖాన్ సరిహద్దు గాంధీగా ప్రసిద్ధుడు. 'ఆయుధం పట్టుకొని యుద్ధం చేసే పఠాన్ కన్నా అహింసను ఆయుధంగా ధరించిన ఈ పఠాన్ చాలా ప్రమాదకారి' అని బ్రిటిష్ పాలకులతో అనిపించుకున్న ధీరోదాత్తుడు. 'ఖుదాయి ఖిద్మత్ గార్' పేరిట భారత స్వాతంత్ర్య పోరాటానికి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన శాంతికాముకుడు. 1969లో గాంధీజీ శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి వచ్చిన ఖాన్ పార్లమెంట్ సంయుక్త సమావేశంలో మాట్లాడుతూ, 'మీరు బుద్ధుడిని మరచి పోయినట్లుగానే గాంధీని మరచి పోతున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కనుక గాంధీతో పాటు, సరిహద్దు గాంధీని కూడా స్మరించుకోవలసిన కర్తవ్యం మనపై ఉంది.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ - ఈయన మహాత్మాగాంధీకి అత్యంత సన్నిహితులు. జాతి గర్వించదగ్గ గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడు. 1920లో తొలిసారి గాంధీజీని కలుసుకున్నది మొదలు చివరివరకు ఆయనతో భుజం భుజం కలిపి నడిచారు. అహింసా మార్గాన ఖిలాఫత్- సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. దేశ విభజనను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. పదేళ్ళకు పైగా జైలు జీవితం గడిపారు. భారత దేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా సేవలందించారు.

ఈ విధంగా అసంఖ్యాకమంది ముస్లింలు గాంధీజీకి మిత్రులుగా, ఉద్యమ భాగస్వాములుగా వెలుగొందారు. నేటి మన దేశ పరిస్థితుల దృష్ట్యా సంక్షిప్తంగానైనా స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల భాగస్వామ్యానికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు పరిచయం చేయడం, ముఖ్యంగా యువతరానికి తెలియ జేయడం మనందరి కర్తవ్యం.

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# వయసు, సొగసు, మనసు అదుపులో ఉంటేనే శ్రేయస్సు

**సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**ఈ గ్రంథం శుభదాయకమైనది. ప్రజలు ఇందులోని వచనాలను గురించి యోచించాలని, బుద్ధిమంతులు గుణపాఠం గ్రహించాలని మేము దీన్ని నీ వద్దకు పంపాము. (సాద్: 29)**

''వయసు'' అనేది ఒక వ్యక్తి శారీరక వయస్సును సూచిస్తుంది, అంటే పుట్టినప్పటి నుండి గడిచిన సంవత్సరాల సంఖ్య. సొగసు అర్థం అందం లేదా ఆకర్షణ. ఇది ఒక వ్యక్తి శారీరక లేదా మానసిక అందాన్ని సూచిస్తుంది. ''మనస్సు'' అనేది ఒక వ్యక్తి మానసిక స్థితి, ఆలోచనలు, భావోద్వేగాలను సూచిస్తుంది.

ఉదాహరణకు, ఒక చిన్న పిల్లవాడు చాలా ఉత్సాహంగా, ఆనందంగా ఉంటాడు. అతని మనస్సు స్వచ్ఛంగా, నిష్కపటంగా ఉంటుంది. కానీ వయస్సు పెరిగే కొద్దీ, అతను అనేక అనుభవాలను ఎదుర్కొంటాడు, అతని మనస్సులో మార్పులు సంభవించవచ్చు. కొంతమంది వ్యక్తులు వయస్సుతో పాటు మరింత పరిణతి చెందుతారు, వారి మనస్సు మరింత ప్రశాంతంగా, స్థిరంగా ఉంటుంది. కొందరు దీనికి పూర్తి భిన్నంగా, చపలచిత్తంగా ఉండొచ్చు.

## వయసు

ఆదర్శ ప్రవక్త ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు: అయిదు విషయాలను అయిదు విషయాలకన్నా ముందు గొప్పవిగా భావించు. నీ యవ్వనాన్ని వృద్ధాప్యం కన్నా ముందు గొప్పదిగా భావించు. నీ ఆరోగ్యాన్ని అనారోగ్యంకన్నా ముందు గొప్పదిగా భావించు. ధనిక స్థితిని పేదరికానికన్నా ముందు గొప్పదిగా భావించు. నీ తీరిక సమయాన్ని కార్య నిమగ్నతకన్నా ముందు గొప్పదిగా భావించు. నీ జీవితాన్ని నీ మరణానికన్నా ముందు గొప్పదిగా భావించు. (సహీహ్ అత్ తర్గీబ్)

వయసు అనగానే చటుక్కున గుర్తుకొచ్చేది యుక్త వయస్సు. ఏ దేశానికైనా శక్తివంతమైన యువత పెట్టని కోట. ప్రపంచంలోనే అత్యధిక యువత ఉన్న దేశం మనది. మన దేశానికి ఇదే అతిపెద్ద వనరు. యువత బాగుంటే దేశం బాగుంటుంది. యువత ప్రగతిపథంలో దూసుకెళ్తే దేశం అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలబడుతుంది. 'ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత ఏ దేశానికయినా అవసరమే, 'ఆశ అంతా యువతపైనే' అని పెద్దలు అన్నట్లుగా సమాజ అభ్యుదయానికి, ఉత్తమ వ్యక్తిత్వ నిర్మాణానికి యువత దృఢ సంకల్పం చేసుకోవాలి.

ఓ యువతా! ఏది మీ దారి- ఏమవుతుంది మీ భావి జీవితం. దేశ భవితవ్యాన్ని నిర్ణయించే భాగ్య విధాతలు మీరు. అసాంఘిక శక్తులను అంత మొందించే మహాస్త్రాలు మీరు. మీరు కన్న కలలు కల్లలవుతాయని రోదిస్తున్నారా.. సమస్యల సుడిగుండాల్ని చూసి పారి పోవాలనుకుంటున్నారా? నిరాశా నిస్పృహలను వదలి ఏకాగ్రచిత్తంతో అలుపెరుగని అడుగు ముందుకు వేయాలి. ఆటుపోట్లను అధిగమించాలి.

లక్ష్యం సాధించేదాకా వేసారక, వెను దిరుగక మీ ముందున్న సవాళ్లను ఎదుర్కొని గమ్యం చేరుకోవాలి. గొప్ప వాళ్ళ చరిత్రలను ఆదర్శంగా తీసుకోవాలి. మీ బంగారు భవితను బాధ్యతా యుతంగా మలచుకోవాలి. పాశ్చాత్య సంప్రదాయాలు, ఫ్యాషన్ ముసుగులో అజ్ఞానాంధ కారంలో మ్రగ్గుతూ వింత పోకడలను ప్రదర్శిస్తూ చిత్ర విచిత్ర వస్త్ర ధారణతో సభ్యతా సంస్కృతులకు కళంకం తేవద్దు. ఊహా జగత్తులో విహరిస్తూ మిమ్మల్ని మీరు మరువకూడదు. వాస్తవాన్ని గమనించాలి. అందని వాటికై అర్రులు

నాగరికతలో ముదిరిపోయిన ఈజిప్షియన్లకు నైతిక రీతినీ, దైవభక్తిని నేర్పిన 'కనాన్' కుర్రవాడు. సుపరిపాలకునిగా ఈజిప్టు చరిత్ర గతిని మార్చిన యుగ పురుషుడు. కనాన్ ప్రదేశంలో పశువుల కాపరులుగా ఉన్న తన కుటుంబీకులకు (ఇస్రాయీలీయులకు) 'ఐగుప్త' దేశంలో 'ప్రవేశం' కల్పించిన మార్గదర్శకుడు. 'ఇస్రాయీల్'గా బిరుదాంకితుడైన మహనీయ యాకూబు (అలైహిస్సలామ్) గారి గారాల పుత్రుడు- ఆయనే హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్).

చాస్తూ కాలయాపన చేయక బాధ్యతలను గుర్తించాలి. ఆధునికత పేరుతో విచ్చలవిడిగా తిరుగుతూ దుర్వ్యసనాలకులోను గాకుండా సత్ప్రవర్తన అలవరచుకోవాలి. రెండు తరాల వారధులు మీరు, ధర్మాన్ని, దేశాన్ని నడిపించే రథసారథులు మీరు. మీ శ్రమనంతా, మీ విజ్ఞానాన్నంతా సంపదకే తాకట్టు పెట్టక మీ శక్తి యుక్తులతో సత్సమాజానికి నాంది పలకాలి. అడుగు వేసేవాడు.. నడుస్తాడు.. ముందడుగు వేసేవాడే గెలుస్తాడు....అలా ముందడుగు వేసిన ముందువారు సహాబా, వారు ఎప్పటికీ ఆదర్శ విషయంలో ముందే ఉంటారు. స్వయంగా ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ అత్యుత్తమ గాథగా పేర్కొన్న సత్యకథ హజ్రత్ యూసుఫ్(అ) వారిది. ఆయన సయితం నూనూగు మీసాల నవ యువకిశోరమే!

## దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అ)

సౌశీల్యానికి, పవిత్రతా పారిశుద్ధ్యాలకు నిర్వచనం ఆయన! స్థితప్రజ్ఞత సమయ స్ఫూర్తికి నిలువెత్తుటద్దం ఆయన. సంస్కరణా ప్రియుడు ఆయన!! మానవ శ్రేయోభిలాషకు ప్రతిరూపం ఆయన!!! ఎంతటి గడ్డు పరిస్థితిలోనయినాసరే ప్రజా ప్రయోజనాలకు, దేశ ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యతనిచ్చే మానవ రత్నాల రాశికి చెందిన మహోన్నత వ్యక్తి!!! అయిన వారి అపరాధాలను పెద్ద మనసుతో మన్నించి ఔదార్యం కురిపించిన మానవతామూర్తి ఆయన!!!!! కాని వారి కుయుక్తు లను సయితం ఉపేక్షించి వారి హృదయాలను జయించిన ఉదాత్తుడు ఆయన!!!!!! విషయం లోతుల్లోకిపోయి, అందలి మర్మాలను పసిగట్టి, పొంచి ఉన్న ప్రమాదాల గురించి సావధాన పరచి, దేశాన్ని ఆర్థిక సంక్షోభాల సుడిగుండం నుండి గట్టెక్కించిన నిస్వార్థ సేవా పరాయణుడాయన!!!!!!!

అందుకే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఆయన గొప్పతనాన్ని కొనియాడుతూ 'కరీం ఇబ్నె కరీమ్ బిన్ కరీమ్ ఇబ్నె కరీమ్' గా ఖరారు చేశారు. (బుఖారీ- కితాబుల్ అన్బియా)

మహాప్రవక్త(స) ఆయన గురించి ఇంకా ఇలా అన్నారు: "ఆయన స్వయంగా ఒక ప్రవక్త. ఆయన తండ్రి ప్రవక్త. ఆయన తాత ప్రవక్త. ఆయన ముత్తాత కూడా ప్రవక్తే. ముత్తాత అగు ఇబ్రాహీమ్‌ను అల్లాహ్ తన నేస్తంగా చేసుకున్నాడు." (బుఖారీ: కితాబుల్ అంబియా)

నాగరికతలో ముదిరిపోయిన ఈజిప్షియన్లకు నైతిక రీతినీ, దైవభక్తిని నేర్పిన 'కనాన్' కుర్రవాడు. సుపరిపాలకునిగా ఈజిప్టు చరిత్ర గతిని మార్చిన యుగ పురుషుడు. కనాన్ ప్రదేశంలో పశు వుల కాపరులుగా ఉన్న తన కుటుంబీకులకు (ఇస్రాయీలీయు లకు) 'ఐగుప్త' దేశంలో 'ప్రవేశం' కల్పించిన మార్గదర్శకుడు. 'ఇస్రాయీల్'గా బిరుదాంకితుడైన మహనీయ యాకూబు (అలైహిస్సలామ్) గారి గారాల పుత్రుడు- ఆయనే హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్). మరో యువకుడు ప్రవక్త మూసా (అ). ఇంకో యువ ప్రవక్త ఈసా (అ). ఇలా చెప్పుకుంటూ పోతే మానవ చరిత్ర గతిని మహాద్భుతంగా మలచిన, మార్చిన మహాత్ములెందరో, మహనీయులెందరో! స్వయంగా అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారు సయితం తన యవ్వన దశ నుండే అభ్యుదయ భావాలు కలిగి ఉండటమే కాక, సంఘానికి మేలు చేసే ఏ కార్యంలోనయినా సరే ఆయన ఎంతో చురుకుగా పాల్గొనే వారు. అలా ఏర్పడిన ఓ ఒప్పందమే 'హిల్ఫుల్ ఫుజూల్'.

చరిత్రలో అయినా, సమాజంలోనైనా యువత పాత్ర ఎంతో కీలకం. ఏ ఉద్యమం విజయవంతం కావాలన్నా, ఏ ప్రాజెక్టు ఫలవంతం అవ్వాలన్నా వారి క్రియాశీలత ప్రధానం. యువతరం దేశానికి ఇంధనం. ప్రగతికి రథచక్రం. చరిత్రలో ఏ మార్పు సంభవించినా అది ఉరకలెత్తే యువత వల్లే సాధ్యం. అలాంటి యువశక్తి నేడు ఎక్కడ చూసినా నిర్వీర్యమౌతుందన్నది కఠోర సత్యం.

మనిషి పెరిగితే చాలదు- ఎదగాలి. పెరిగితే ముసలాళ్లవుతారు. ఎదిగితే ఉన్నత వ్యక్తులవుతారు. పెరగడం సర్వ సహజం. ఎదగడం గర్వకారణం. ఎదిగేవారు ఎన్నుకునే మార్గాలు విభిన్నంగా ఉంటాయి- అందరం చేసే పనులనే వారూ చేస్తారు- కాకపోతే మనకన్నా విభిన్నంగా. అలాంటి విజేతల ఆలోచనల్లో ఓ గొప్పదనం తొణికిసలాడుతుంది.

కాలం ప్రతి ఒక్కరినీ నిరాడంబరంగా మారుస్తుంది. వయసు పెరిగేకొద్దీ విలాసాల కోసం వెంపర్లాడటం మాని చిన్న చిన్న

**మనిషి ముఖ్యంగా యవ్వనంలో ఉన్న మనిషి - అతను కడలి కెరటాలకు ఎదురీదగలడు.పర్వత శిఖరాలు అధిరోహించడానికీ వెనుకాడడు. ఆకాశ గర్జనలకు, ఉరుముల మెరుపులకూ భయపడడు. బలిష్టమైన ఎనుబోతులతో తలపడటానికి కూడా వెనుకంజ వేయడు. క్రూర మృగాలను వేటాడటానికీ జంకడు. ఖడ్గాల నీడలో విన్యాసాలు చేయడానికీ, కత్తి మీద సాము చేయడానికి కూడా వెరవడు. కాని-భావోద్రేకాల ముందు వివశుడై పోతాడు. తన మనసులో మగువ రేపే చిన్న అలజడికి కూడా తట్టుకోలేడు. వలచి వచ్చిన వయ్యారి భామ వాలు చూపులకు ఉక్కిరిబిక్కిరై పోతాడు. కైపులో తేలిపోతాడు. కరిగిపోతాడు.**

అనుభూతుల విలువను తెలుసుకుంటాం. కంటినిండా నిద్ర, ఆరోగ్యకర ఆహారం, మనసారా మాట్లాడే స్నేహితులు, కుటుంబ సభ్యులతో సమయం గడపడం.. ఇలాంటి వాటికున్న విలువ అర్థమవుతుంది. మనశ్శాంతే నిజమైన సంపద అని, సాధారణ జీవితమే అంతిమ లక్ష్యమని గుర్తిస్తాం. యుక్త వయసులోనే దీన్ని అర్థం చేసుకుని జీవిస్తే మరీ మంచిది. 'యువతరం శిరమెత్తితే.. నవతరం గళమిప్పితే/ లోకమే మారిపోదా.. చీకటే మాసిపోదా?' అన్న కవి ఆశాభావం నిజం అవ్వాలి. నిజం చెయ్యాలి మీరు.

## సొగసు

వానొచ్చిందంటే ఒళ్ళు తడవడం, వరద రావడం ఎంత సహజమో, వయసొచ్చిందంటే వలపు రావడం, కోర్కెలు రేగడం అంతే సహజం, దీనికి తోడు- కుర్రాళ్ళోయ్ కుర్రాళ్ళు వెర్రెక్కి ఉన్నోళ్ళు.. కళ్లాలే లేనోళ్ళు కవ్వించే సోగ్గాళ్ళు.. ఆటగాళ్ళు పాటగాళ్ళు అందమైన వేటగాళ్ళు.. హద్దులేవి లేనివాళ్ళు ఆవేశం ఉన్నవాళ్ళు.. అని ఓ కవి అన్నట్టు- వలపుతోపాటు వగరు, జిగురు, వదరు, పొగరు ఉండనే ఉంటుంది. ఆ వలపు ఏ తలుపు తడుతుందో, ఎలాంటి తలపు కలిగి ఉంటుందో దాన్ని బట్టే అసలు భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. యువకులు అద్భుతమైన మానవులుగా వికసించనూ గలరు లేదా ఓ విపత్తుగానూ పరిణమించగలరు. ఈ రెండింటిలో ఏదైనా జరిగేందుకు అవకాశం ఉంది. యవ్వన దశలో అఖండమైన శక్తి ఇంకా మేధస్సనే కుసుమాలు వికసిస్తాయి. కాని అదే సమయంలో, వారి తెలివి వారి హార్మోన్‌ల కారణంగా దారి మళ్లించబడేందుకు అవకాశం ఉంది. కారణం- సొగసు - అందం, ఆకర్షణ. ఇది యువతతో ఉన్న ప్రధాన సమస్య. "యౌవన దశ, విలాసాలలో మునిగిపోయే సమయం కాదు. యవ్వనం అన్వేషణను, సాహసాలను చేసే సమయం".

మంచి పెరెంట్స్ మనం - అంతా అయిపోయాక ఏం చేయాలా అని తల పట్టుకోవడంకన్నా ముందు నుండే పిల్లలకి అన్నిటిపై అవగాహన ఉండేలా చూడాలి. వారి జీవితం గురించి వారికో ఒపీనియన్ ఉండేలా చూడాలి. వారి నడవడిక, అలవాట్లను ఓ కంట కనిపెడుతూ ఉండటం మంచిది. అలా అని వారికి ఇబ్బందిగా ఉండకూడదు, వారి స్వాతంత్ర్యాన్ని లాక్కోనూ కూడదు. మా పిల్లలు ఎలాంటి వారో మాకు తెలుసు, మా పిల్లలు బంగారం అంటారా... పిల్లలు సంగతి సరే మరి వయసు, ఆ వయసులో ఉండే ఆలోచనల సంగతేంటి?

బరి తెగించిన ఆడదానికి గానీ, మగ మారాజుకిగాని వావి వరుసలు ఉండవు. అంతస్తు గురించి అసలే పట్టింపు ఉండదు. సిగ్గూ ఎగ్గూ ఏమీ ఉండదు. అవును, 'కామా తురాణాం న భయం న లజ్జ'. పరువం ఉరకలు వేసే వయసులో ఉన్న ఏ వ్యక్తి అయినా సొగసు వారి పాలిట ఓ అగ్ని పరీక్షే అని చెప్పక తప్పదు. రాగ ద్వేషాల పరీక్షకన్నా మహా రాక్షసి భావోద్రేకాల పరీక్ష. ఒక మనిషి పాలిట అత్యంత కఠినమయిన పరీక్ష ఏదంటే అది భావోద్రేకాల పరీక్షే. అందులోనూ యవ్వనంలో ఉన్న మనిషి తన లైంగిక వాంఛలకు పగ్గం వేయటం అంత తేలిక కాదు.

మనిషి ముఖ్యంగా యవ్వనంలో ఉన్న మనిషి - అతను కడలి కెరటాలకు ఎదురీదగలడు.పర్వత శిఖరాలు అధిరోహించడానికీ వెనుకాడడు. ఆకాశ గర్జనలకు, ఉరుముల మెరుపులకూ భయపడడు. బలిష్టమైన ఎనుబోతులతో తలపడటానికి కూడా వెనుకంజ వేయడు. క్రూర మృగాలను వేటాడటానికీ జంకడు. ఖడ్గాల నీడలో విన్యాసాలు చేయడానికీ, కత్తి మీద సాము చేయడానికి కూడా వెరవడు. కాని-భావోద్రేకాల ముందు వివశు డై పోతాడు. తన మనసులో మగువ రేపే చిన్న అలజడికి కూడా తట్టుకోలేడు. వలచి వచ్చిన వయ్యారి భామ వాలు చూపులకు ఉక్కిరిబిక్కిరైపోతాడు. కైపులో తేలిపోతాడు. కరిగిపోతాడు. అతని ఊహలకు ఒక్కసారిగా రెక్కలొచ్చేస్తాయి. కోర్కె కదము తొక్కుతుంది. అతని అడుగులు తడబడతాయి.

పిల్లలు ఆకర్షణలో పడకుండా ఆపడం ఎవరి వల్లా జరగదు. కావాల్సినంత ప్రేమ చూపించి, వారితో మాట్లాడి, అన్నీ పంచుకుని, మా పిల్లలు అలా చేయరు అని ఆశించడం తప్పు.

మనం చేయకూడనివి కొన్ని ఉంటాయి - ఉదాహరణకు - 1) వాళ్ళని కోపగించుకోవడం. దీనివల్ల అవతలి వాళ్ళ మీద ఇష్టం ఇంకా పెరిగిపోతుంది. 2) అవతలి వాళ్ళ నుండి దూరం చేయడం, అంటే ఫోన్ లాక్కోవడం, కాలేజీకి వెళ్లకుండా

ఆపేయడం లాంటివి. ఇది చాల డేంజర్. ఎందుకంటే ఇలాంటి సమయాల్లో పిల్లలు ఇంట్లో నుండి వెళ్లిపోయే అవకాశాలు ఎక్కువ. మొన్న ఈ మధ్యనే తన ప్రేమను అంగీకరించలేదని 20 మందికి పైగా తన ఇంటి సభ్యులను ఓ టెన్త్ క్లాసు అమ్మాయి విషం పెట్టిన విషయం తెలిసిందే! 3) అస్సలు చేయకూడనిది చేయి చేసుకోవడం. ఇది జరిగితే వాళ్ళు ఏదోక కారణంతో వాళ్ళు నన్ను కొడుతున్నారు, మానసికంగా హింస పెడుతున్నారు అని విషయం మార్చేసే అవకాశం ఎక్కువ.

ఇప్పుడు అరచేతిలో ఇమిడే ఫోన్‌లలోనే అశ్లీలత చేరిపోవడంతో మానసిక పరిపక్వత చెందని వయసులోనే టీనేజీ యువతపై దాని ప్రభావం పడుతోంది. దీంతో వారు చెడు మార్గం పడుతు న్నారు. కొన్ని టీవీ సీరియళ్ల ప్రభావం టీనేజీపై తీవ్రత చూపిస్తున్నది. సీరియళ్లలో వచ్చే కొన్ని సంఘటనలను ఆదర్శంగా తీసుకుని తెలిసీ తెలియని వయసులో పిల్లలు ప్రేమ అనే ముసుగులో జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొన్ని కుటుంబాల్లో టీనేజ్ ట్రాక్ తప్పుతోంది. సామాజిక మాధ్యమాల ప్రభావం విరిసీ విరియని మనసులపై విషం చిమ్ముతున్నాయి. హైస్కూల్ చదివే వయసు నుంచే లవ్‌స్టోరీలు మొదలవుతున్నాయి. ప్రేమో.. ఆకర్షణో తెలుసుకునే సరికే బాల్యం బలవుతోంది.

### ప్రవాస ప్రజల అగచాట్లు

కొన్ని కుటుంబాలలో జీవనోపాధి కోసం భర్త లేదా భార్య ఇతర దేశాలకు వెళుతూ తమ పిల్లలను పెద్దల వద్ద ఉంచుతున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తమ తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలను ఏ మేరకు గమనిస్తున్నారోననే విషయం గమనించక ముందే ప్రమాదం జరిగిపోతోంది. జీవనోపాధికై ఇతర ప్రాంతాలకు వెళ్లక తప్పదు. కానీ అదే సమయంలో పిల్లల నడవడికను ఎప్పటి కప్పుడు గమనించకపోవడం వల్లే ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

అలాగే పొరుగింటి మంగళ గౌరి వేసుకున్న గొలుసు చూడు - ఎదురింటి పిన్ని గారి మురుగులు చూడు - ఇరుగు పొరుగు వాళ్ళు భలే బాగుపడ్డారు. నగ నట్రా ఐఫోన్ గట్రా కొనుకున్నారు - మన పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది... అని ఫీలయిపోతూ అవసరం లేనివాటిని కొంటూ.. పక్కింట బ్బాయికో, ఎదురింటమ్మాయికో మంచి స్మార్ట్‌ఫోన్ కొనిచ్చారని తెలిసి తమ పిల్లలేమీ తక్కువ కాదని గొప్పలకు పోతూ వాళ్లకు ఫోన్‌లు ఇవ్వడం వల్ల నష్టంతోపాటు కష్టాలు కొని తెచ్చుకోవడమే అవుతుంది. ఇంటర్ చదువు పూర్తయ్యేంత వరకూ ఫోన్లు ఇవ్వొద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్ క్లాసులకు ఫోన్ అవసరమైతే ఆ సందర్భంలో పెద్దలు పిల్లలను తమవద్దే ఉంచుకుని పాఠాలను నేర్పించాలని చెబుతున్నారు.

**(మిగతా వచ్చేవారం)**

## అంతర్ నేత్రం

ఎవర్ని హింసించే దుర్నీతి?
ఎందుకీ ప్రేలాపనలు
ప్రహసనాల వృథా ప్రయాసలు
వ్యక్తిత్వ హననం
పక్షపాత వ్యాఖ్యానం
పరమ రోత భాషణం
మళ్లీ "స్వేచ్ఛ" ముసుగులో
నిరాధార పారాయణం
అక్రమాల విషక్రిముల పుట్టలు
నేటి మాధ్యమాల కథనాలు
సాధికారత లోపించిన దుర్భర విన్యాసాలు
రోడ్లపైకి విసిరేసిన స్త్రీ జాతి ఔన్నత్యం
వ్యవస్థలన్నీ తమ గుప్పిట్లో
బందీలన్న భ్రాంతి
సత్యాల్ని నిగ్గు తేల్చే సంస్థల క్రెడిబిలిటీ
అర్భక అజ్ఞాన మాధ్యమాల్లో విలవిల
వంత పాడి బుసకొట్టే విషనాగుల స్వరాలు
ప్రగతి, అభ్యుదయంపై పాడే అపస్వరాలు
అగ్గి రాజేసే అరాచక ముసుగు ముఠాలు
సర్వం సొంతమనుకునే ఏకపక్ష వికృతాలు
గతం తవ్విన గోతుల్లోంచి నిటారుగా మొలిచిన తెలంగాణ
చీకటి పొరల్ని చీల్చిన వెలుగు రేఖల తేజం
ముసిరిన అభూత కల్పనల
మేఘాల దొంతరలు
అస్తిత్వ తుఫాన్ గర్జనలో
అంతమయ్యే దుశ్చర్యలు
ప్రజాస్వామ్య పీఠంపై నినదించే
ఆదర్శ జర్నలిజం
అది ప్రజాభీష్టమాలకించే
అంతర్నేత్రం

కె. లక్ష్మణ్ గౌడ్
కాన్సస్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా




# మైనారిటీ వ్యధ

అర్షియా

**భారతదేశం** ప్రజాస్వామ్య దేశమైనప్పటికీ, ఇక్కడ మైనార్టీలపై జరిగే దాడులు, వివక్ష, అన్యాయాలు వాస్తవానికి చాలా బాధాకరంగా ఉన్నాయి. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించినా, క్షేత్ర స్థాయిలో అందుకు విరుద్ధంగా ఉంటోంది. భారత్‌లో ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు వంటి మైనారిటీలు తరచూ మత వాద విద్వేషానికి గురవుతున్నారు. వారి పట్ల వివక్ష, మత పరమైన హింస కొనసాగు తున్నది. ఈ హింస కొన్ని సార్లు చెలరేగి, మత కలహాలుగా మారుతున్నది. మైనారిటీల ప్రాణాలకు, ఆస్తులకు భయంకర నష్టం జరుగుతున్నది.

## గో రక్షణ పేరుతో హింస

“గో రక్షణ” పేరిట మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింలు, ఆవులను అక్రమ రవాణా చేస్తున్నారన్న అనుమానంతో కొన్ని హిందూ అతివాద వర్గాలు మూక దాడులకు పాల్పడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఇది బాధితుల చావుకి దారి తీస్తోంది. ఈ తరహా ఘటనలు అనేక సందర్భాల్లో సోషల్ మీడియా, ప్రింట్ మీడియా ద్వారా బయటపడుతున్నా, ప్రభుత్వ స్పందన చాలా తక్కువగా ఉంటోంది. 2015లో ముహమ్మద్ అఖ్లాఖ్‌ను గో గూండాలు అత్యంత కిరాతకంగా హతమార్చారు. 2017లో పెహ్లూ ఖాన్‌ను, 17ఏళ్ల జునైద్ ఖాన్‌ను, 2019లో తబ్రేజ్ అన్సారీ, 2023లో ఇన్‌హాఖ్... ఇలా గో రక్షకుల మూకదాడిలో బలయ్యారు. ఎంతో మంది గాయాలపాలయ్యారు.

## వ్యాపార రంగంలోనూ వివక్ష

ఒక ముస్లిం వ్యాపారి హిందువుల ప్రాబల్యం గల ప్రాంతాల్లో చిన్న వ్యాపారం ప్రారంభిస్తే అతడిని బెదిరించడం, తిట్టించడం జరుగుతున్నది. కోవిడ్ సమయంలో ముస్లిమ్ వ్యాపారులు తీవ్ర వివక్షను ఎదుర్కొన్నారు. అదే ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వ్యాపారాలు చేసే హిందువుల పట్ల ఎలాంటి వివక్ష చూపించకుండా, ముస్లింలు వారిని స్వాగతిస్తారు.

## అద్దె ఇంటికి కష్టాలు

ముస్లింలు ఇల్లు అద్దెకు తీసుకోవాలంటే అనేక అడ్డంకులు ఏర్పడుతున్నాయి. వారి మత గుర్తింపు ఆధారంగా వివక్ష పెరుగు తోంది. ముస్లింలు మత పరమైన చిహ్నాలు ధరించి తిరుగుతుంటే వారిని అనుమానంగా చూస్తున్నారు. కాలేజీల్లో హిజాబ్ తొలగించాలని అమ్మాయిలను వేధిస్తున్నారు. టోపీ ధరించ కూడదని ఉద్యోగులపై దాడులు జరుగుతున్నాయి. ఉర్దూ భాష మాట్లాడే ముస్లిములపై కూడా దాడులు చేస్తున్నారు.

## ‘బాబ్రీ’ ఘటనతో విభజన తీవ్రం

ఉత్తరప్రదేశ్‌లో బాబ్రీ మసీదు కూల్చివేసిన తరువాత, మతాల మధ్య గల విభజన మరింత తీవ్రమైంది. “లవ్ జిహాద్”, మతం మార్పిడి నిషేధం వంటి అంశాలపై కొన్ని రాష్ట్రాలు చట్టాలు తీసుకొచ్చాయి. ఇవన్నీ ముఖ్యంగా ముస్లింల, క్రైస్తవుల స్వేచ్ఛను హరిస్తున్నాయి.

## చట్ట పరమైన వేధింపులు

UAPA, NSA వంటి కఠినమైన చట్టాలు ముస్లింలపై అమలు చేయబడుతున్నాయి. వారి మీద తప్పుడు కేసులు పెడుతూ, నిరూపించలేని ఆరోపణలతో ఏళ్ల తరబడి జైళ్లలో ఉంచుతు న్నారు. చివరికి వారు నిర్దోషులుగా బయటపడినా, వారి జీవితం నాశనమవుతోంది. కుటుంబం, మానసిక ఆరోగ్యం దెబ్బ తింటున్నది.

## మీడియా వివక్ష

మైనారిటీలపై జరిగిన దాడులను అధిక శాతం మీడియా సంస్థలు వాటిని ప్రసారం చేయవు. అదే ముస్లింలపై తప్పుడు ఆరోపణలు వస్తే వాటిని పెద్దగా చూపిస్తూ మైనారిటీలపై ద్వేషాన్ని పెంచు తున్నాయి.

## పరిష్కారాలేమిటి?

❖ చట్టాలు కఠినంగా అమలు చేయాలి.

❖ ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలి.

❖ పోలీస్ వ్యవస్థలో సంస్కరణలు చేయాలి.

❖ పౌరులందరికీ మత బేధం లేకుండా మానవ హక్కులు ఉంటాయని ప్రచారం చేయాలి.

❖ ఉచిత లీగల్ ఎయిడ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

❖ చక్కటి నైతిక విలువలతో కూడిన విద్యాబోధనకు ప్రాచుర్యం కల్పించాలి.

## ఇస్లాం సహజ, సార్వత్రిక ధర్మం

ఇస్లాం ఒక సహజ సిద్ధమైన, విశ్వవ్యాప్త ధర్మం. ఈ మతంలోని శాంతి, దయ, నైతికత, సమానత్వం వంటి విలువలు ఎంతో మందిని ఆకర్షిస్తున్నాయి. సత్యాన్ని కోరే ఉన్నత మనస్కులైన వ్యక్తులు ఇస్లాం బోధనలకు ఆకర్షితులవుతుంటారు. వారు మానవత్వం, నైతికతపై ఆధారపడిన ఈ మతాన్ని స్వీకరించాలని కోరుకుంటారు. అయితే, దీన్నే మతం మార్పిడిగా చూపించి ముస్లిం మత గురువులను అరెస్టు చేయడం, వారిపై వివక్ష చూపడం జరుగుతోంది. చాలా మంది ముస్లిం మత నాయకులు మత ప్రచారం చేసినందుకు కారాగారాల్లో మగ్గుతున్నారు.

## కర్ణాటక హైకోర్టు శుభవార్త

ఇటీవల కర్ణాటక హైకోర్టు మత ప్రచార ఆరోపణలపై అరెస్టైన ముగ్గురు ముస్లిం యువకులపై నమోదు అయిన కేసులను రద్దు చేసింది. ఒక హిందూ దేవాలయంలో ఇస్లాం మత ప్రచార కర పత్రాలు పంపిణీ చేయడం మతం మార్పిడికి సమానం కాదని స్పష్టం చేసింది. మతం మార్పిడి జరిగింది అనే స్పష్టమైన ఆధారం లేకపోతే దాన్ని నేరంగా పరిగణించలేమని తీర్పు వెలువరించింది. ఈ తీర్పు న్యాయ శీలత, రాజ్యాంగబద్ధమైన స్వేచ్ఛకు మద్దతు తెలిపే మంచి ఉదాహరణ.

## ముస్లింల పాలనలో పరమత సహనం

చరిత్రను పరిశీలిస్తే... భారతదేశంలో ముస్లింల పాలనలో హిందువులకు, క్రైస్తవులకు, సిక్కులకు, ఇతర మతస్తులకు పూర్తిగా మత స్వేచ్ఛ ఉండేది. వారు స్వేచ్ఛగా తమ ప్రార్థనా మందిరాలు నిర్మించుకొని, పూజలు చేసుకునే స్వేచ్ఛ కలిగి ఉండేవారు. పూజారులకు గౌరవం, జీతభత్యాలు ఉండేవి. ముస్లిం పాలకులు న్యాయంగా, సమానంగా వ్యవహరిస్తూ మత సామరస్యానికి కట్టుబడి ఉండేవారు.

## చరిత్రలో కీలక ఉదాహరణలు

➢ ఖలీఫా ఉమర్ (ర.అ) బైతుల్ మఖ్దిస్ (జెరూసలేం) పట్టణాన్ని స్వాధీనం చేసుకున్న తరువాత అక్కడి క్రైస్తవులకు ప్రార్థనా స్వేచ్ఛను కల్పించారు.

➢ ఇస్లాంకు చెందిన తుఫైల్, ఇబ్నె రుష్ద్ వంటి మేధావులు యూరప్‌లో ఆవిష్కరణల కాలాన్ని ప్రభావితం చేశారు.

➢ అందలూస్ (ఇప్పటి స్పెయిన్) ముస్లిం పాలనలో ఉన్నప్పుడు యూదులు, క్రైస్తవులకు విద్య, వాణిజ్యంలో సమాన అవకాశాలు కల్పించబడ్డాయి.

➢ ముహమ్మద్ బిన్ ఖాసిమ్, అలా ఉద్దీన్ ఖిల్జీ, ముహమ్మద్ తుగ్లక్, ఔరంగజేబ్ వంటి పాలకులు దేవాలయాలకు భద్రత కల్పించి అనేక దానాలు చేసినట్టు చారిత్రక ఆధారాలున్నాయి.

## ముస్లిం దేశాల్లో మత స్వేచ్ఛ

ఈ రోజుల్లో ముస్లిం దేశాల్లో అనేక మంది హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు ఇతర మతస్థులు పెద్ద పెద్ద ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారు. ఇది ముస్లింల పాలనలో మత స్వేచ్ఛ, మానవ హక్కులు ఎలా ఉంటాయన్న దానికి నిదర్శనం.

## భారతదేశంలో మైనారిటీలపై వివక్ష, అణచివేత ఆగాలంటే ఏం చేయాలి?

➢ చట్టాల్ని సమర్థవంతంగా అమలు చేయాలి.

➢ జైళ్లలో ఉన్న నిర్దోషులైన మైనారిటీలను విడుదల చేయాలి.

➢ మత వైషమ్యాన్ని ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకోవాలి.

➢ విద్యా వ్యవస్థలో మత సహన శీలతను బోధించాలి.

➢ న్యాయ వ్యవస్థ, పోలీసు వ్యవస్థ, మీడియా బాధ్యతగా పని చేయాలి.

## ముగింపు

ఇస్లాం మానవత్వాన్ని, శాంతిని ప్రోత్సహించే మతం. భారతదేశం మతం, సంస్కృతి వైవిధ్యాలకు నిలయంగా ఉండాలి. మత భేదం లేకుండా భారతీయులందరూ తోటి వారి పట్ల ప్రేమ, సహనంతో వ్యవహరించాలి. అప్పుడే ఈ దేశం నిజమైన సెక్యులర్ ప్రజాస్వామ్య దేశంగా నిలుస్తుంది.

కథ



# ఆత్మ విమర్శన

షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల

**వేగంగా** వెళుతున్న కారు స్లో చేసారు కరీముల్లా. ట్రాఫిక్, దానితోపాటు రోడ్డుపై ఓ వార చిన్నగా నడుస్తున్న గొర్రెల మంద. యాంత్రికంగా అటువైపుగా చూసారు. మస్జిద్, దాని ప్రక్కన ఓ మదరసా ఉండేది. మస్జిద్ అయితే ఉంది కాని, మదరసా బంద్ అయిన చిహ్నాలు అగుపిస్తున్నాయి. ఏమైంది చెప్మా అనుకుంటుండగానే మస్జిద్ నుండి అజాన్ వినిపిస్తుంది. శుక్రవారం, జుమా ఇక్కడే చదువుదాము, వేరే మస్జిద్ వెళ్ళినా కార్ పార్కింగ్ కష్టం అనుకుంటూ మస్జిద్ వైపు కారు తిప్పారు కరీముల్లా. నమాజ్‌కు కనీసం పదిహేను నిమిషాలు సమయం ఉంది.

ఆ మస్జిద్‌కు, తమకు ఓ అనుబంధమే ఉంది. తన తండ్రిగారు ఉన్నప్పుడు ఆ మస్జిద్ అభివృద్ధిలో చాలా పాలు పంచుకున్నారు. ఆ నేపథ్యంలోనే ప్రక్క మదరసాకు కూడా మంచి ప్రోత్సాహమే ఇచ్చారు. తన తండ్రిగారు అన్ని వ్యవహారాలు చూసుకునేవారు. తమ్ముడు అప్పటికే మెడిసిన్‌లో ఎంఎస్ చేసి ఓ ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో బిజీ. తాను తమ కంపెనీకి వ్యాపారాలు చూస్తున్నా, ఆర్థిక వ్యవహారాలు తన తండ్రి గారే చూసుకునేవారు. క్రమేపి తాము అపార్ట్మెంట్‌లో చేరిపోవడం, తండ్రి నజీరుద్దీన్ కాలం చేయడంతో ఆ మస్జిద్‌తో కొద్దిగా దూరం అయ్యారు. ఏమైనా చాలా రోజుల తరువాత ఆ మస్జిద్‌కు రావడం చాలా ఆనందంగా ఉంది. మస్జిద్‌లో ఎంటరైన తరువాత కరీముల్లా కొద్దిసేపు కూర్చొని మస్జిద్‌ని పరికించి చూస్తున్నారు. మస్జిద్ బాగా అభివృద్ధి చెందింది, ఏసీ కూడా వేయబడింది. తమకు తెలిసిన వారు ఎవరన్నా వున్నారేమో అంటే తనను గుర్తు పట్టడం వాళ్ళకు కష్టమే. ఓ పెద్దాయనకు కరీముల్లా దగ్గరగా వెళ్ళి పలకరించారు, తాను నజీరుద్దీన్ వాళ్ళ అబ్బాయని. ఓహ్! చాలా రోజులకు అగుపించావు, నాన్నగారున్నప్పుడు రోజూ వచ్చేవారు, ఆ పాలరాతి మింబర్ మీ డాడీ వేయించిందే అంటూ పాత జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. మాటల్లో కరీముల్లా అడిగారు, "చాచా! ప్రక్కన మదరసా ఉండేది కదా! అది ప్రస్తుతం లేదు ఎక్కడికన్నా మార్చారా" అని. లేదు బాబు ఓ వంద మంది పిల్లలు బాగా చదువుకునేవారు, మీ నాన్నా వాళ్ళు ఇతర టీచర్లను నియమించి ప్రైవేటుగా పదవ తరగతి చదివే ఏర్పాటు చేసారు. కాని రాను రాను దాని మెయింటైన్ ఖర్చులు ఎక్కువ కావడంతో భారం తడిసి మోపెడయింది. మీతో సహా చాలామంది ఇటు రావటమే కష్టం అయింది. మీ దగ్గరికి కూడా ఆ మౌలానా వచ్చినట్టుంది. ఆయన చేతకాక రెండు సార్లు మస్జిద్ కమిటీ ముందు ఉంచినా, మాకు భారమే కావడంతో సహకరించలేకపోయాం. అందుకే పాపం మౌలానా క్లోజ్ చేసారు. ఆ మౌలానా కూడా మెహిదీపట్నంలో ఎక్కడో ఇమామత్ చేసుకుంటున్నారు అంటూ పెదవి విరిచారు.

మస్జిద్ చిన్నగా నమాజీలతో నిండుతుంది. కరీముల్లా సున్నత్ నమాజుల ఆచరణ పూర్తి అవుతుండగానే ఇమామ్ ప్రసంగం మొదలు పెట్టారు. రెగ్యులర్ ఇమామ్ కాదనుకుంటా, యువకుడిగా ఉన్నారు. ఖుర్ఆన్, హదీసు వెలుగులో ఆర్థిక అసమానత్వం ఎలా దూరం చేయగలరో సోదాహరణలతో వివరిస్తున్నారు. ఇతర ఇస్లాం ధర్మాలు ఆచరించినట్లు ముస్లింలు జకాత్ కూడా ఓ విధి అని భావించరు, మన దేశంలో తాహతు ఉన్నవారందరూ లెక్కకట్టి జకాత్ ఇస్తే ముస్లిం సమాజం పేదరికంలో ఉండదని కరాఖండిగా తేల్చేశారు. ప్రవక్త కాలంలో పేదవానిగా ఉన్న ప్రవక్త(స) సహచరుడి వృత్తాంతం వివరిస్తూ, ప్రవక్త దుఆతో దైవం తనకు జకాత్ ఇచ్చే స్థాయికి చేర్చితే జకాత్ ఇవ్వడం పెడచెవిన పెట్టారని, నేడు అలాంటి వారు చాలా మంది వున్నారని, జకాత్ ఇవ్వకుండా స్థిరాస్తులు పెంచుకుంటు ఆత్మ తృప్తి పడుతున్నారు కాని వాస్తవానికి అది ఆత్మద్రోహం అన్నారు. కరీముల్లాకు ఆ మాటలు తూటాల్లా ఎక్కడో తగుల్తున్నాయి. ఇమామ్ గారు సంధించే ప్రశ్నలు జకాత్ ఎగవేత వల్ల సమాజంలో పేదల హక్కు కాలరాయడమే కాదు, అది పాపం, నేరం. పైగా దాన్ని ఒప్పుగా చిత్రీకరించే ద్రోహం... ఇమామ్ గారి నోటి నుండి వెడలిన ప్రతి పదం చర్నాకోళై ఝుళిపించింది. యథాలాపంగా జుమా ధార్మిక విధులు పూర్తయ్యాయి.

కరీముల్లా మస్జిద్ బయటికి వచ్చి భారంగా కారు ఎక్కారు. ఇంటికి కూడా వెళ్ళకుండా ఫ్యాక్టరీ కార్యాలయానికి చేరుకున్నారు. ఏదో యాంత్రికంగా రెండు మెతుకులు నమిలి ల్యాప్ ట్యాప్ ఎదురుగా పెట్టుకొని చూస్తున్నారు. గత సంవత్సరం ఆదాయం మిగులు పై రెండున్నర శాతం లెక్కేస్తే జకాత్ డెబ్బై లక్షల పైచిలుకే! తను ఆదాయం మొత్తం ఓ భూమి కొని నామినల్‌గా పది లక్షలు కొందరికి జకాత్ అంటూ పంచారు. బంధువులకు కూడా నామమాత్రంగా ఇచ్చారు. తను చాలా ద్రోహానికి పాల్పడ్డారు. జకాత్ ఎగ్గొట్టినట్టు అగుపించదు. తనలాంటి వారి వల్ల పేదల హక్కు హరించ బడుతుంది. తనలాంటి వారు సమాజంలో చాలా మంది ఉన్నారు. తామే మేధావులైనట్లు జకాత్ నుండి తప్పించుకోవడానికి ఇంటి నిర్మాణాలు, కార్లు కొనడం చేస్తుంటారు. ఆ మదరసా మూత పడటానికి తనలాంటి వారే కారణం. ఏమైనా తనకు దైవం జ్ఞానోదయం కలిగించాడు. దీనికి తానే బాధ్యత వహించాలి అనుకున్నారు. తను కొన్న పొలంలో ఓ మాడ్రన్ మదరసా కమ్ స్కూల్ నిర్మించి అందరితో కలిసి నిర్వహించాలి అన్న కృతనిశ్చయంతో లేచారు కరీముల్లా. ఆయన మనసు నిండా ఓ విద్యాలయం నిండిపోయింది. ఓ విధంగా తన తండ్రి ఆశయం నేరవేర్చుతున్నానన్న తృప్తితో కళ్ళు చెమర్చాయి. ఇక నుంచి తాను ఏటేటా లెక్క ప్రకారం జకాత్ ఇవ్వాలని దృఢంగా నిర్ణయించుకున్న కరీముల్లాకు దగ్గర మస్జిద్ నుండి హయ్యా అలల్ ఫలాహ్.. సాఫల్యం వైపునకు రండి అన్న అజాన్ పిలుపు శ్రావ్యంగా వినిపిస్తుంటే అస్ర్ నమాజ్‌కు సిద్ధమయ్యారు కరీముల్లా భాయ్!


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# ఇవి యధార్థమైన విషయాలు

- నసీరా బేగం

**ఇదీ** ఒక యథార్థమైన విషయం. అదేమిటంటే, ప్రపంచంలో పుట్టే ప్రతి మనిషి తన విధివ్రాతలో కేవలం సంతోషాలే లేదా దుఃఖాలే తీసుకుని రాడు. ఒక మనిషి జీవితంలోని ఒక భాగం సంతోషాలతో నిండి ఉంటుంది. మరొక భాగం దుఃఖాలతో, కష్టాలతో  నిండి ఉంటుంది. దీనికి సంబంధించిన ఎన్నో సంఘటనలను మనం అనునిత్యం చూస్తూనే ఉంటాము. మరెన్నో అనుభవాలు మనకు కలుగుతూ ఉంటాయి. ఇంకా ఇక్కడ కొంతమందిని విజయానందంతో కేరింతలు కొడుతూ ఉండటం చూస్తాము. మరి కొంతమందిని వైఫల్య బాధతో కుంగిపోతూ ఉండటం కూడా చూస్తాము. ఇదంతా ఒకే రోజులో, ఒకే చోటలో చూసే దృశ్యాలు.

ఉదాహరణకు, ప్రతిదినం వచ్చే వార్తా పత్రికను  తిరగవేస్తూ ఉంటే లేదా వార్తలు టీవీలలో చూస్తూ ఉంటే అందులోని కొన్ని చిత్రాలు ఆనందంతో చిరునవ్వులు చిందిస్తూ ఉంటాయి. మరికొన్ని ఆశ్చర్యకరంగా చూస్తూ ఉంటాయి. ఇంకా కొన్ని నిరాశా నిస్పృహలకు లోనై ఉంటాయి. మరికొన్ని చిత్రాలు ఆశతో నోరు తెరచుకుని ఎదురుచూస్తూ ఉంటాయి. ఇంకా కొన్ని బాధతో కుమిలిపోతూ ఉంటాయి. ఇంకా కొన్ని బాధలకు తట్టుకోలేక విలువైన ప్రాణాలను సైతం పోగొట్టుకుని ఉంటాయి.

అంతేకాదు ఉదయం నుంచి రాత్రివరకు వచ్చే ఫోన్ కాల్స్ ద్వారా తెలిపే సమాచారాలు కూడా విభిన్న రకాలుగా ఉంటాయి. ఒక ఫోన్ కాల్ వివాహ ఆహ్వానానికి సంబంధించినదై ఉంటే మరొకటి కుటుంబంలో ఎవరికో ఒకరికి పాప పుట్టిందనో, బాబు పుట్టాడనో సంతోష వార్త ఉంటుంది. అంతలోనే మరొక ఫోన్ కాల్ వస్తుంది. ఫలానా వారు వ్యాధికి గురయ్యారనో లేదా మృతి చెందారనో బాధాకరమైన వార్త మనకు చేరుతుంది. ఇవన్నీ మనిషి జీవితంతో ముడివడి ఉన్న విషయాలు.

మనిషి ఈ మొత్తం తీపి, చేదు అనుభవాల నుండి, యథార్థాల నుంచి, కొంతసేపటి వరకు దృష్టిని మరల్చి ఒకసారి తను పుట్టినప్పటి నుంచి నేటి వరకు తన జీవితంలో ఎదురైన విభిన్న పరిస్థితులపై దృష్టిని సారిస్తే అతని బాల్యం ఎలా గడిచిందో, ఆ సమయంలో అతను ఏ ఏ పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చిందో, యవ్వనంలో అడుగు పెట్టినప్పటి  నుంచి ఎన్ని సవాళ్ళను ఎదుర్కోవలసి వచ్చిందో, ఆ తరువాత వయసు కొద్దిగా పెద్దదైన తరువాత ఎలాంటి ఆటంకాలను, ఎలాంటి బాధ్యతలను ఎదుర్కోవలసి వచ్చిందో ఆలోచిస్తే అప్పటి వరకు జరిగిన అతని జీవితపు చలన చిత్రం అతని కళ్ళ ముందు స్పష్టంగా కదలాడుతుంది.

అయితే దీనిద్వారా తెలుసుకోవలసిన విషయం ఏమిటంటే అతని జీవితపు అనుభవం అతనికి ఏమి నేర్పింది? అతనిని నిరాశా నిస్పృహలలోకి నెట్టివేసిందా? లేదా ఆశల కిరణాలు చూపించిందా? ఇంకా అతని జీవిత యదార్థం తెలిపిందా? అనేది.

అతని జీవితంలో ఎన్నో సంతోష సమయాలు వచ్చాయి. అవి కాలగర్భంలో కలిసి పోయాయి. మరెన్నో దుఃఖపు దినాలు వచ్చాయి. అవీ కాలగర్భంలో కలిసి పోయాయి. ఎన్నో విజయాలు లభించాయి. వాటి జ్ఞాపకాలు కూడా క్రమక్రమంగా చరిత్రలుగా

మిగిలిపోయాయి. మరెన్నో ఓటములు కూడా ఎదురయ్యాయి. వాటి జ్ఞాపకాలు కూడా కనుమరుగై పోయాయి. ఎన్నో వ్యాధులు వచ్చాయి. అవి మళ్ళీ స్వస్థతగా మారిపోయాయి. ఎన్నో బలహీనతలు పొడసూపాయి. మళ్ళీ అవి శక్తిగా రూపాంతరం చెందాయి. ఎన్నో కష్టాల కడగండ్ల ఎత్తైన పర్వతాలు అవరోధాలుగా నిలిచాయి. అవీ తొలగిపోయాయి.

ఇంకా జీవితంలో ఎంతోమంది ప్రాణ స్నేహితులు ప్రాణ శత్రువులైపోయారు. ప్రాణ శత్రువులు ప్రాణ స్నేహితులైపోయారు. ఎన్నో నాటిన ప్రేమ బీజాలు మహా వృక్షాలుగా రూపాంతరం చెందాయి. ఎన్నో చిన్న చిన్న మొక్కలు పెద్ద పెద్ద వృక్షాలై పోయాయి. శరీరంపై కలిగిన పెద్ద పెద్ద గాయాలు మాని పోయాయి. మాయమైపోయాయి. హృదయంపై గుచ్చుకున్న ఎన్నో వ్యంగ్యపు బాణాలు తొలగిపోయాయి. వాటికి సంబంధించిన గుర్తులు కూడా కనుమరుగైపోయాయి. వాటి భావాలు తుడిచి పెట్టుకుపోయాయి.

ఇవన్నీ అతని జీవితపు సత్యాలు అయినప్పుడు ఇక్కడ ఉద్భవించే ఒక పెద్ద ప్రశ్న ఏమిటంటే, మనిషికి ఎదురయ్యే ఈ సుఖదుఃఖ సమయాలలో అతను ఎలాంటి పాత్ర పోషించాలి అనేది.

సుఖదుఃఖాలు అనేవి కేవలం అతని హృదయంలో ఏర్పడే భావనలు మాత్రమే అని తెలుస్తోంది. అవి మనిషి పరిస్థితులను బట్టి అతని హృదయంలో కలుగుతూ ఉంటాయి. ఉదాహరణకు ఒక మనిషి చెరసాల జీవితం గడుపుతున్నాడు. అయితే ఆ చెరసాల జీవితం అతనికి ఇబ్బందికర జీవితం కాదు. ఆ చెరసాల జీవితంలో అతని హృదయంపై కలిగిన ఒత్తిడి, దాని ద్వారా కలిగే పేదరికం, నిస్సహాయత, ఇంటి వారితో దూరం లాంటివి అతని హృదయాన్ని ఆందోళనకు గురి చేస్తాయి. ఆ ఆందోళనలో మనిషి మానసిక క్షోభకు గురవుతాడు. అదే విధంగా మనిషికి ఇష్టమైన కార్యాలు జరిగినప్పుడు, అతని కోరికలు తీరినప్పుడు అతని హృదయంలో కలిగే సంతోష భావాలు అతనికి మానసిక ప్రశాంతతను ప్రసాదిస్తాయి.

అయితే ఈ సుఖదుఃఖాలు మనిషి జీవితంతో ఇంతగా ముడివడి ఉన్నప్పుడు అతను వీటిని సాధారణమైనవిగా భావించాలి. సంతోష సమయాలలో గాలిలో తేలియాడుతూ ఉండకూడదు. దుఃఖ సమయాలలో నిరాశా నిస్పృహలతో క్రుంగిపోకూడదు. రెండు సమయాలలో కూడా హృదయాన్ని సమతూకంగా ఉంచాలి. సుఖం ఉదయపు కాంతి అయితే దుఃఖం రాత్రి చీకటి అని భావించాలి. ఏవిధంగా అయితే ఉదయపు కాంతి తరువాత రాత్రి చీకటి వస్తుందో అదేవిధంగా కష్టసుఖాలు ఒకదాని తరువాత ఒకటి వస్తూ పోతూ ఉంటాయి. ఏ విధంగానైతే పగలూ రాత్రి కాలంలో కలసిపోయి చరిత్రగా మారిపోయి, దాని భావాలు కనుమరుగై పోతాయో అదేవిధంగా మనిషి కష్టసుఖాలు కూడా చరిత్రగా మారిపోయి వాటి భావాలు కనుమరుగైపోతాయి. ఏవిధంగానైతే ఉదయపు కాంతి, రాత్రి చీకటి మనిషి జీవితానికి అవసరమో అదేవిధంగా మనిషి ఇహలోకపు పరీక్షా జీవితానికి సుఖదుఃఖాలు కూడా అవసరమే. మనిషి ఈ సత్య విషయాన్ని గనక అంగీకరించి నట్లయితే అతనికి ఏ విధంగానైతే సుఖం సంతోషాన్ని, మానసిక ప్రశాంతతను ప్రసాదిస్తుందో అదేవిధంగా దుఃఖం కూడా అతనికి ఒక విధమైన సంతృప్తిని, మనో నిబ్బరాన్ని, మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. పైగా సంతోషంలో కలగని ప్రత్యేకమైన భావనలు అతనికి దుఃఖంలో తప్పకుండా కలుగుతాయి. అదేమిటంటే, దైవ సామీప్యం. నాకూ, అల్లాహ్‌కు మధ్య ఎవరూ అడ్డుగా లేరనే ఒక ప్రత్యేక భావన. నా ప్రభువు నన్ను ఇట్టే వదిలివేయడనే అచంచలమైన విశ్వాసం. అంతేకాదు, నాకు కలిగిన ఈ దుఃఖానికి బదులు ఇహలోకంలో కూడా తప్పకుండా లభిస్తుందని, పరలోకం లోనైతే దానికి అనంతమైన ప్రతిఫలం లభిస్తుందని గట్టి నమ్మకం. ఈ నమ్మకం ద్వారా లభించే హృదయ ప్రశాంతత అతనికి సంతోష తరంగాలలో తేలియాడేలా చేస్తుంది. దైవ సహాయంతో ఆ దుఃఖాలను ఛేదించే శక్తిని ప్రసాదిస్తుంది.

కనుకనే దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; విశ్వాసి పరిస్థితి కడు విచిత్రం. 1) అతనికి సుఖం, సంతోషం కలిగినప్పుడు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటాడు. ఇది అతని కొరకు పుణ్యప్రదం అవుతుంది. 2) దుఃఖం, కష్టం కలిగినప్పుడు సహనం వహిస్తాడు. ఇది కూడా అతనికి పుణ్యప్రదమే.

ఈనాడు మనం మన సమాజంపై దృష్టిని సారిస్తే సమాజంలో మానసిక వ్యాధిగ్రస్తుల సంఖ్య నానాటికి పెరిగిపోతూ ఉందని తెలుస్తోంది. ఈ వ్యాధి పుణ్యమా అంటూ మనిషిని ఇతర వ్యాధు లన్నీ ఒక దాని తరువాత ఒకటి చుట్టుముడుతూ ఉన్నాయి. ఒకనాడు మనిషి నిస్సహాయ స్థితిలో, అజ్ఞాన స్థితిలో ఉండి కూడా మానసిక వ్యాధికి గురయ్యేవాడు కాదు. ఈనాడు అన్నీ ఉండి, జ్ఞాన స్థితిలో కూడా ఉండి మానసిక రోగానికి గురవుతున్నాడు. ఇది అత్యంత శోచనీయమైన విషయం. దానికి ఒక మూల కారణం ఏమిటంటే, మనిషి ఈ ప్రపంచంలోనే స్వర్గంలో లభించే సుఖాలు, కానుకలు లభించాలనే దురాశను కలిగి ఉండటం అని స్పష్టమవుతోంది. ఈ విషయానికి జవాబుగా అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; నేను సుఖ సంతోషాలను స్వర్గంలో ఉంచాను. కాని అజ్ఞాని అయిన మనిషి వాటిని ఈ ప్రపంచంలో వెతుకు తున్నాడు. అంటే లేని దాన్ని వెతకటం అంటే ఎండమావులను చూసి ఒయాసిస్సు అని భ్రమపడడమే.




## ఒక్క శాతం మంది వద్దే అరవై శాతం సంపద..

భారత్‌లోని సంపదంతా కొందరి వద్దే పోగుపడి ఉంటోందని తాజా అధ్యయనం వెల్లడించింది. దేశంలోని మొత్తం సంపదలో దాదాపు 60 శాతం సంపద కేవలం ఒక శాతం కుటుంబాల వద్దే పేరుకుపోయిందని బ్రోకరేజీ సంస్థ బెర్న్‌స్టీన్ తాజా నివేదిక తెలిపింది. భారత్‌లోని 30 లక్షల కుటుంబాల వద్ద దాదాపు 2.7 లక్షల కోట్ల డాలర్లు(సుమారు రూ. 235 లక్షల కోట్లు) సంపద ఉందని నివేదిక వెల్లడించింది. కొన్ని కుటుంబాల వద్దే డబ్బు పోగుపడి ఉండడం వల్ల భారత్‌లో సంపన్నులు మరింత సంపన్నులుగా మారిపోతున్నారని నివేదిక పేర్కొంది. ఈ కొంత మంది కుబేరుల ఆర్థిక లావాదేవీలను చక్కపెట్టేందుకు ప్రొఫెషనల్ ఫైనాన్స్ మేనేజర్ల కోసం డిమాండు పెరిగే అవకాశం ఉందని బ్రోకరేజీ సంస్థ అభిప్రాయపడింది.

## ఒబిసిటీ పెరిగిపోతోంది

భారత్‌లో ఊబకాయం సమస్య ఆందోళనను కలిగిస్తున్నది. ఇది పెద్దలు, పిల్లలు అనే తేడా లేకుండా ఈ సమస్యను తీవ్రతరం చేస్తున్నది. ఐక్యరాజ్యసమితి(యూఎన్)కి చెందిన పలు సంస్థలు రూపొందించిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది. ఈ మేరకు తాజాగా స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ (సోఫీ) ఇన్ ది వరల్డ్ 2025 నివేదిక విడుదలైంది. ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ), ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఎఫ్‌పీ), వ్యవసాయ అభివృద్ధి కోసం అంతర్జాతీయ నిధి(ఐఎఫ్ఏడీ), యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్ (యునిసెఫ్) లు ఈ నివేదికను రూపొందించాయి.

## 58 కోట్ల మందికి అందని పోషకాహారం

పోషకాహార లోపం భారత్‌కు పెను సమస్యగానే ఉన్నది. ఇప్పటికీ దేశంలో 40.4 శాతం మంది, అంటే 58.50 కోట్ల మంది ఇప్పటికీ ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందలేకపోతున్నారని సోఫీ నివేదిక వివరించింది. ఇది చాలా ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నది. భారత్‌లో 2022-24లో 17.2 కోట్ల మంది పోషకాహార లోపంతో బాధపడ్డారు. ఒక పక్క భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని చెప్పుకుంటున్నా, ఇక్కడి ప్రజలకు కనీసం ఆరోగ్యకరమైన ఆహారం అందలేని పరిస్థితులున్నాయని విశ్లేషకులు చెప్తున్నారు.

## అతి నిద్రతో ఆరోగ్యానికి చేటు!

రాత్రి సమయంలో తక్కువ నిద్ర అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందన్నది మనకు తెలిసిందే! అయితే.. అంతకు మించిన ఆరోగ్య సమస్యలు రాత్రిపూట 9 గంటలకు మించిన అధిక నిద్రతో ఉంటాయని తాజా అధ్యయనం ఒకటి హెచ్చరించింది. అధిక నిద్ర వల్ల గుండె సమస్యలు, డిప్రెషన్, అధిక బరువు, టైప్-2 డయాబెటిస్, రోగ నిరోధక శక్తి క్షీణించటం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తి, మరణించే ముప్పును అధికం చేస్తాయని పరిశోధకులు తేల్చారు. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ జర్నల్ కథనం ప్రకారం, పరిశోధకులు 79 సుదీర్ఘమైన అధ్యయనాల్ని విశ్లేషించారు. రాత్రిపూట ఏడు గంటల కన్నా తక్కువ సమయం నిద్ర పోయేవాళ్లకు 14 శాతం మరణించే ముప్పు ఉందని తేలగా, 9 గంటలకు మించి నిద్రపోయేవాళ్లలో మరణించే ముప్పు 34 శాతం ఉంటుందని అధ్యయనం పేర్కొన్నది. ప్రతి రోజూ అధిక నిద్ర (9 గంటలకు మించి) కలిగిన వాళ్లలో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నది గత అధ్యయనాల్లోనూ బయటపడిందని పరిశోధకులు తెలిపారు. గత అధ్యయనాల డాటాను విశ్లేషించగా, అన్ని వయస్సుల వారిలో ఒకే విధమైన నిద్ర తీరు ఉండదని, టీనేజర్లకు 8 నుంచి 10 గంటల నిద్ర అవసరమవుతుందని, అదే పెద్దవాళ్లకు 7 నుంచి 9 గంటల నిద్ర సరిపోతుందన్న సంగతి గుర్తించారు.

## మహిళలు, ముస్లింలే లక్ష్యంగా...

బిహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైంది. ఈ ముసాయిదా జాబితాను పరిశీలిస్తే కొన్ని దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు బయటపడ్డాయి. జాబితా నుంచి తొలగించిన ఓటర్లలో సగానికి పైగా అంటే 55 శాతం మంది మహిళలే. ఇక్కడ మరో ఆశ్చర్యకరమైన విషయమేమంటే, రాష్ట్రంలోని పది జిల్లాలలో ముస్లిం జనాభా అధికంగా ఉంది. వీటిలో ఐదింటిలో భారీగా ఓటర్లను తొలగించారు. పశ్చిమ బీహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లాలో అత్యధికంగా 15.1 శాతం మంది ఓటర్లను తొలగించారు. ఒక్క గోపాల్‌గంజ్ శాసనసభ స్థానంలోనే 18.25 శాతం మంది ఓటు హక్కును కోల్పోయారు. ఓటర్ల తొలగింపులో ప్రథమ స్థానం ఈ నియోజకవర్గానిదే.

## బంగ్లా ఎన్నికలు ఫిబ్రవరిలో

బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగుతాయని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వంలోని ముఖ్య సలహాదారు ముహమ్మద్ యూనుస్ తెలిపారు. ప్రధానిగా షేక్ హసీనా పదవీచ్యుతురాలై ఏడాది అయిన సందర్భంగా ఢాకాలో ఓ చానల్‌తో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. రమజాన్ మాసం 2026 ఫిబ్రవరి 17-18న మొదలవుతుందని, ఆ లోపే ఎన్నికలు పూర్తిచేయాలని ఎన్నికల సంఘాన్ని లేఖ ద్వారా కోరినట్లు ఆయన వెల్లడించారు.

## ఇస్రాయిల్‌కు వ్యతిరేకంగా సిడ్నీలో భారీ ర్యాలీ

గాజాపై ఇస్రాయిల్ దాడులను ఖండిస్తూ పాలస్తీనా వాసులకు మద్దతుగా ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే సహ అనేక మంది ప్రముఖులు, ప్రజలు గాజావాసులకు మద్దతు పలికారు. ప్రఖ్యాత సిడ్నీ హార్బర్ బ్రిడ్జ్ పైకి భారీగా చేరుకున్న నిరసనకారులు గాజా వాసులకు మద్దతుగా బ్యానర్లు ప్రదర్శించారు. గాజాపై దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. మానవతా సాయం అందేలా చూడాలని కోరారు. భారీ సంఖ్యలో వచ్చిన ప్రదర్శనకారులు తమ మార్గాన్ని మార్చుకోవడంతో.. సిడ్నీ హార్బర్ బ్రిడ్జిపై ట్రాఫిక్‌ను నిలిపివేశారు. ఇస్రాయిల్ దాడుల్లో గాజాలో 60,400 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో సిడ్నీలో ర్యాలీ నిర్వహించారు.

## గాజాలో కరువు రక్కసి బారిన చిన్నారులు!

గాజాలో ఇప్పటివరకు కరువు కాటకాలతో మరణించిన వారి సంఖ్య 159కి చేరింది. వీరిలో 90మంది పిల్లలే వున్నారు. గాజాలో కొత్తగా జన్మిస్తున్న పిల్లలందరూ తక్కువ బరువుతో వుంటున్నారని, పోషకాహార లోపం వల్ల వారు సరిగా ఎదగడం లేదని ఆస్పత్రి వర్గాలు చెప్పాయి. ఇటువంటి ఆందోళనకర పరిస్థితుల్లో గాజాలోకి ప్రతిరోజూ వందలాదిగా ఆహార ట్రక్కులు రావాలని ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ (యూఎన్‌ఆర్ డబ్ల్యూఏ) ప్రతినిధి అద్నాన్ అబూ హస్నా పేర్కొన్నారు. కాల్పుల విరమణ జరిగితేనే గాజాలో మానవతా సంక్షోభం పరిష్కారమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. గాజా ప్రజలకు ఆహారం అందాలంటే ఆహార ట్రక్కులు కూడా సురక్షితంగా చేరాలని, అందుకు ఇస్రాయిల్ సహకరించాలని అన్నారు. గాజాకు అందే ఆహార సాయం ముందుగా ఐక్యరాజ్య సమితి గిడ్డంగులకు చేరితే, అక్కడి నుండి పంపిణీ కేంద్రాల వద్దకు చేరుతుందని అన్నారు. గాజాలో మంచినీటి శుద్ధి కేంద్రాలను నాశనం చేశారు. దీంతో తాగు నీరు కలుషితమై వ్యాధులు ప్రబలుతున్నాయి.




## ఆస్ట్రేలియాలో పిల్లలకు యూట్యూబ్ నిషేధం

ఆస్ట్రేలియా ప్రభుత్వం టీనేజర్ల సోషల్ మీడియా వినియోగాన్ని కట్టడి చేసేందుకు సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో యూట్యూబ్‌ను నిషేధించారు. ఆస్ట్రేలియా ఇంటర్నెట్ వాచ్‌డాగ్ నివేదికల ప్రకారం 10 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లలలో 37% మంది యూట్యూబ్‌లో హానికరమైన కంటెంట్‌ను చూశారని తేలింది. ఇది సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో అత్యధికం కావడం విశేషం. ఈ కారణంగా యూట్యూబ్‌ను కూడా నిషిద్ధ జాబితాలో చేర్చారు. దీంతో ప్రపంచంలోనే మొదటిసారి యూట్యూబ్ నిషేధించిన జాబితాలో ఈ దేశం చేరింది. డిసెంబరు 2025లో అమలులోకి వచ్చే ఈ కొత్త నిబంధనల ప్రకారం, 16 ఏళ్లలోపు పిల్లలు ఇకపై ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లలో అకౌంట్లను ప్రారంభించలేరు.

## ప్రపంచంలో అత్యధిక వలసదారులు భారత్ నుంచే

ఏమిటీ.. ఏ దేశంలో చూసినా భారతీయులే కనబడుతున్నారు.. విదేశాల్లో మనవారు అంతమంది ఉన్నారా? అన్న అనుమానం మీకు ఎప్పుడైనా కలిగిందా? మీ అనుమానం నిజమే.. ఐక్యరాజ్యసమితి వెల్లడించిన గణాంకాలు కూడా ఆ విషయాన్నే నిర్ధారిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వలసదారుల్లో అత్యధికులు భారతీయులే అని ఐరాస వెల్లడించింది. 2024 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 1.85 కోట్ల మంది ప్రవాస భారతీయులు ఉన్నట్టు, ఇది ప్రపంచ వలసదారుల్లో 6 శాతం అని తెలిపింది. ఒకప్పుడు సౌదీ అరేబియా, దుబాయి దేశాలకే పరిమితమైన భారతీయ వలస సముదాయం ఇప్పుడు పశ్చిమ దేశాలకు బదిలీ అయ్యింది. పశ్చిమాసియాలోని ఇండియన్ డయాస్పోరాను తీసుకుంటే యూఏఈలోని మొత్తం జనాభాలో 40 శాతం (ఇంచుమించు మూడో వంతు) భారతీయ వలసదారులే ఉన్నారు. ఇక అమెరికాలో ఇండో అమెరికన్లు రెండో అతిపెద్ద ఆసియన్ గ్రూప్‌గా ఉన్నారు. మొదటి స్థానంలో చైనీస్ అమెరికన్లు ఉన్నారు.

# నడిచే దారిలో...

- షేక్ హసన్ సాహెబ్

**పూర్వం** ఒకానొక రాజు తన రాజ్యంలో ప్రజల సామాజిక స్పృహను తెలుసుకునేందుకు పలు ఉపాయాలు ఆలోచించేవాడు. ఒకసారి మారువేషంలో బయటకు వచ్చి దారి మధ్యలో పెద్ద బండరాయిని ఉంచాడు. ఆ బండ రాయిని ఎవరు తొలగిస్తారో చూడాలనే ఉద్దేశంతో ఆ పక్కనే ఉన్న చెట్టు పక్కకు వెళ్లి దాగాడు.


ఆ దారి గుండా ఎంతోమంది వ్యాపారులు, సంపన్నులు వెళుతూ కనబడ్డారు. ఎవరూ ఆ బండరాయిని తొలగించే ప్రయత్నం చేయకపోగా రాజుగారిని నానా మాటలు అన్నారు. అంతలో ఒక రైతు కూరగాయల కావిడిని మోసు కుంటూ అటుగా వచ్చాడు. ఆ బండరాయిని చూసి ఆగాడు. తన భుజంపై ఉన్న బరువును పక్కనపెట్టి రాకపోక లకు అడ్డంగా ఉన్న ఆ బండరాయిని తొలగించే ప్రయత్నం మొదలెట్టాడు. ఎంతోసేపు చెమటోడ్చిన తరువాత గానీ ఆ బండరాయి తొలగలేదు.

ఆ బండరాయి కింద ఒక చిన్న పెట్టె కనపడింది. అందులో ఎన్నో విలువైన బంగారు నాణాలు చూసి ఆశ్చర్యపోయాడు. అందులో ఒక ఉత్తరం కూడా ఉంది. 'ఎవరైతే ఈ బండ రాయిని తొలగిస్తారో ఈ నాణేలన్నీ వారి సొంతం' అని రాసిపెట్టి ఉంది ఆ ఉత్తరంలో. ఇతరులకు సౌకర్యాలు కల్పించడంలో మనం పడే శ్రమ మన విజయానికి కారణ మవుతుంది. తోటివారికి సౌలభ్యాలు కలగజేయాలే కానీ కష్టాలు కలగజేయకూడదన్నది ఇస్లామ్ బోధన. మనం నడిచే దారిలో బాటసారులకు ఇబ్బంది కల్గించే రాయిరప్పలు, ముళ్లు, దుర్గంధం ఇలా ఏ వస్తువునైనా తొలగించడం కూడా దానంతో సమానమంటారు ప్రవక్త మహనీయులు(స). దారిలో బాటసారుల రాకపోకలకు ఇబ్బంది కల్గించే దేన్నయినా తొలగించి సౌలభ్యాన్ని కలిగించడం ఎంతో పుణ్యప్రదం. ఈమాన్ (విశ్వాసం) శాఖలు డెబ్బై. 'దారిలోనుంచి ఏదైనా ఇబ్బంది కల్గించే వస్తువును తొలగించండం' వాటిలో ఒకటి అని చెప్పారు ప్రవక్త(స). నడిచే దారిలో అడ్డంగా ఉన్న వాటిని తొలగించడం విశ్వాసానికి చిహ్నం.

ఒక వ్యక్తి ప్రవక్త (స) దగ్గరకు వచ్చి 'ప్రవక్తా! నా దగ్గర దానం చేయడానికి అంత స్థోమతలేదు. మరి నేనెలా దానం చేయను' అని దీనంగా అడిగాడు. దానికి ప్రవక్త(స) 'నడిచే వీధుల్లోనుంచి ప్రజలకు అవరోధంగా ఉన్న రాయిరప్ప, ముళ్లకంప తొలగించడం కూడా దానమే' అని అన్నారు. ఈ దానం చేయడానికి ఎలాంటి సొమ్ము అవసరం లేదు. సేవ చేయాలన్న మంచి మనస్సు ఉంటే చాలు.

మనం నడిచే వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న వాటిని తొలగించడం ఎంత ప్రాధాన్యత సంతరించుకుందో పై సంఘటన తెలియ జేస్తుంది. దారి మధ్యలో పడి ఉన్న చిన్నపాటి రాయిని తొలగించడం చూసేవారికి చిన్న పనిలాగే కనిపిస్తుంది కానీ అల్లాహ్ దృష్టిలో ఎంతో గొప్ప పని.

తుదిగేటు




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**